
MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 302 | పేజీలు : 8 | గురువారం 22 అక్టోబర్ 2026 | వెల : 6-00

రాడీయిజం చేస్తే అణచివేయండి





శాంతిభద్రతల్లో దేశానికి ఆదర్శంగా ఏపీ

బాధితులకు భరోసాగా పోలీసు శాఖ

రాజకీయ ముసుగులో చేసే నేరాలపై ఉక్కుపాదం

పోలీసు అమర వీరుల కుటుంబాలకు అండగా నిలుస్తాం

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

మంగళగిరి, మహానగర్

శాంతిభద్రతల పరిరక్షణలో ఏపీ పోలీసు శాఖ దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాక్షించారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, బాధితులకు భరోసా ఏర్పడాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవనం సాగించే పరిస్థితులు కల్పించాలని పోలీస్ శాఖకు సూచించారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో బుధవారం నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం పోలీసులను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ఖాకీ అంటే బాధ్యత.. పోలీసు అంటే భరోసా అని సీఎం పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి పోలీసులే ధైర్యం, స్థైర్యమని అన్నారు. ప్రమాదం జరిగినా, నేరం జరిగినా ముందుగా గుర్తుకొచ్చేది పోలీసులేనని చెప్పారు. ప్రజల ఇళ్లలో పండుగ వెలుగులు నింపేందుకు పోలీసులు తమ కుటుంబాల పండుగలకు దూరమవుతున్నారని అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రులు, విజయవాడ ఉత్సవ్, వీఐపీల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దసరా ఉత్సవాలను అత్యంత ప్రశాంతంగా ప్రజలు నిర్వహించు కోవటంలో పోలీసుల నిరంతర శ్రమ అభినందనీయమని అన్నారు. 1959 అక్టోబరు 21న లడఖ్‌లో చైనా సైనికుల దాడిని తిప్పికొడుతూ పదిమంది పోలీసులు వీరమరణం పొందారని, వారి - మిగతా 2లో



డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

- 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చడే మా లక్ష్యం
- దిల్లీలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి
- రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని ఆయన పిలుపు

5

రెబల్స్ బరిలో ఉంటే సస్పెన్షన్ వేటు తప్పదు

- సీఎం చంద్రబాబు వార్నింగ్
- తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- స్థానిక ఎన్నికల్లో రెబల్స్ బరిలో ఉంటే పార్టీ నుంచి సస్పెన్షన్ వేటు తప్పదని సీఎం హెచ్చరించారు.
- జనసేన, బీజేపీ నేతలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలి



అమరావతి, మహానగర్

పట్టణ స్థానిక సంస్థల నామినేషన్లపై సుప్రీంకోర్టు తీర్పును వైఎస్సార్సీపీ వక్రీకరిస్తోందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయం కోసం తప్పు దోవ పట్టిస్తోందని ఆరోపించారు. జగన్ లాంటి క్రిమినల్ లిటిగెంట్ల వల్ల అభివృద్ధి, సంక్షేమానికి ఆటంకాలు ఎదురవుతున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాము అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తుంటే, జగన్ మాత్రం ఏ ప్రాంతంలో రౌడీలను దించాలనే విధ్వంసరచన చేస్తున్నారన్నారు. స్థానిక పోరుకు ప్రచారాన్ని ఉద్ధృతం - మిగతా 2లో



పుర ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్

నేడు నిర్ణయం వెల్లడించనున్న రాష్ట్ర ఎన్నికల సంఘం

సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో తాజా ప్రకటన

మొత్తం 100 పుర, నగరపాలక సంస్థలకూ వర్తింపు

అమరావతి, మహానగర్

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను ఈ నెల 25వ తేదీ వరకు ప్రకటించవద్దని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు ఇచ్చే నివేదికలను పరిశీలించి గురువారం తుది నిర్ణయం వెల్లడిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అప్పటివరకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా విడుదల చేయొద్దని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. దీంతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయినా.. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల నిలిపేశారు. పిడుగురాళ్ల, గురజాల, దర్శి, పుంగనూరు, మైదుకూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, రాయచోటి, దాచేపల్లి, గుత్తి, రాజంపేట, పులివెందుల, బద్వేలు, ప్రొద్దుటూరు, కనిగిరి, తాడిపత్రి, జమ్మలమడుగు పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతో పాటు కడప, తిరుపతి నగరపాలక సంస్థల్లో నామినేషన్లు వేయకుండా తమను అడ్డుకున్నారని సుప్రీంకోర్టులో వైకాపా పిటిషన్ వేసింది. దీనిపై విచారించిన అత్యున్నత న్యాయస్థానం 25వ తేదీ వరకు అభ్యర్థుల జాబితా ప్రకటన నిలిపివేసి.. ఫిర్యాదులపై గురువారం ఒక నిర్ణయం ప్రకటించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. నామినేషన్ దాఖలుకు - మిగతా 2లో

వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం

- ఈనెల 26న కేఆర్ఎంబీ సమావేశం
- ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశం
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించి వచ్చే వారంలో కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు సమావేశం కానున్నాయి.



అమరావతి, మహానగర్

తెలుగు రాష్ట్రాల నీటి అంశాలకు సంబంధించి వచ్చే వారం రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల భేటీల్లో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాల వాటాకు సంబంధించి ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించిన పరస్పర ఫిర్యాదులు, పోలవరం, టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు సహా ఇతర అంశాలు - మిగతా 2లో



ఆందోళనలు హింసకు దారితీస్తాయి

- సీజేపీ నేతల కేసు విచారణలో ఫ్రాన్స్ అల్లర్లను ప్రస్తావించిన హైకోర్టు
- దిల్లీ హైకోర్టులో సౌరవ్ దాస్, ఆశు తోష్ రాంకాకు ఊరట లభించలేదు
- ప్రత్యామ్నాయ న్యాయ మార్గాన్ని ఆశ్రయించాలని హైకోర్టు సూచించింది.

5

రౌడీయిజం చేస్తే అణచివేయండి

-మొదటిపేజీ తరువాయి

త్యాగానికి గుర్తుగా ఏటా ఈ రోజును పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలను స్మరించుకోవడం కేవలం సానుభూతి కాదని, సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.

శాంతిభద్రతలతోనే పెట్టుబడులు

ఆంధ్రప్రదేశ్ పోలీసులకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని చంద్రబాబు అన్నారు. గతంలో ఫ్యాక్షన్‌ను నియంత్రించడంలో, నక్సలిజాన్ని ఎదుర్కోవడంలో, మత కలహాలను అరికట్టడంలో పోలీసులు అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారని గుర్తుచేశారు. శాంతిభద్రతలు, అభివృద్ధి, ఉపాధి, ప్రజల సుఖసంతోషాలు పరస్పరం ముడిపడి ఉన్నాయని చెప్పారు. భద్రతపై నమ్మకం ఉన్న ప్రాంతాలకే పెట్టుబడులు వస్తాయని, పరిశ్రమలు ఏర్పాటై ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అందుకే తాను అధికారంలో ఉన్నప్పుడల్లా శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. ఇటీవల ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం దేశ భద్రతకు భంగం కలిగించే కుట్రలను ఛేదించి పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచిందని అభినందించారు. పోలీసు విధుల్లో ధైర్యంతోపాటు మానవత్వం కూడా అవసరమని సీఎం సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో వస్తారని, కొందరు భయంతో, మరికొందరు కన్నీళ్లతో వస్తారని చెప్పారు. వారి సమస్యలను సానుభూతితో విని, గౌరవంగా వ్యవహరించి, సత్వర పరిష్కారం చూపాలని కోరారు. పోలీసుల తక్షణ స్పందన ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని పేర్కొన్నారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని ఉపేక్షించకూడదని, రాజకీయాలు నేరస్థులకు రక్షణ కల్పించకూడదని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీలు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత



నేరాలకు పాల్పడే పద్ధతులు మారుతున్నందున దర్యాప్తు విధానాల్లోనూ మార్పులు రావాలని చంద్రబాబు అన్నారు. ఒక్క ఫోన్‌కాల్, లింక్, సందేశంతో జీవితకాలం కష్టపడి సంపాదించిన సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకున్నవారు సైతం ఈ మోసాలకు బలి అవుతున్నారని అన్నారు. నేరాలను ఛేదించడం పోలీసుల సమర్థతకు నిదర్శనమైతే, అవి జరగకుండా నివారించడం అత్యుత్తమ పోలిసింగ్ కు నిదర్శనమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను గుర్తించడంతోపాటు, డేటా విశ్లేషణతో వాటి వెనుక ఉన్న వాస్తవాలను వెలికి తీయాలని సూచించారు. డ్రోన్ల వినియోగాన్ని నిఘా సహా వివిధ అవసరాలకు విస్తరించాలని చెప్పారు. ఏఐ లాంటి సాంకేతికతను ఉపయోగించి దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ఏపీ పోలీసులే అగ్రగాములనే గుర్తింపు దేశవ్యాప్తంగా రావాలని ఆకాంక్షించారు. వెల్ఫీ, హెల్ఫీ, హ్యాపీ ఏపీ లక్ష్య సాధనలో పోలీసుల పాత్ర కీలకమని సీఎం పేర్కొన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ బృందం చేస్తున్న కృషిని అభినందించారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మహిళలకు భద్రత కల్పించ లేకపోతే ప్రయోజనం లేదని అన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే నేరస్థులు భయపడే పరిస్థితి తీసుకురావాలని సూచించారు.



పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించాలని చెప్పారు. తీవ్ర ఒత్తిడితో పనిచేసే పోలీసులు యోగా, ధ్యానం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. పోలీసు అమర వీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పోలీసుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. అమరుల త్యాగాలకు ఘనమైన నివాళి అర్పించాలంటే ప్రజలకు నిరంతర భద్రత కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగల పూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తదితరులు అమర జవాన్ స్మృతిచిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. షహీద్ పుస్తక్ టోలీ, అమరులు వారు పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు సంస్మరణ నిధికి సీఎం విరాళం అందించారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాలు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి, ఫోరెన్సిక్, విపత్తు నిర్వహణ పరికరాలు, ఆక్టోపస్ సహా ఇతర విభాగాల ఆధునిక ఆయుధాల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. నిఘా వ్యవస్థలో డ్రోన్ల వినియోగాన్ని మరింత పెంచాలని అధికారులకు సూచించారు.

పుర ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్

-మొదటిపేజీ తరువాయి

ఎక్కడైనా గడువు పొడిగించాల్సి వస్తే.. నిర్ణయం ప్రకటించినప్పటి నుంచి గరిష్ఠంగా 48 గంటల సమయం ఇవ్వాలని నిర్దేశించింది. దానిపై ఎన్నికల కమిషనర్ పునేఠా బుధవారం రాత్రి న్యాయ నిపుణులతో చర్చించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన 100 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని రాత్రి 10.30 గంటల తర్వాత ప్రకటించారు.

పునరావృతం కానీయొద్దు

రాష్ట్రంలో ఏడు జిల్లాల్లో 19 పుర, నగరపాలక సంస్థల్లో మినహా మిగిలిన చోట్ల యథావిధిగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని అంతకుముందు ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. బుధవారం ఆయన వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, అనంతపురం, ప్రకాశం, పల్నాడు, మార్కాపురం మినహా మిగిలిన జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలు ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియలో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నామినేషన్ల సమయంలో అభ్యర్థులకు భద్రత కల్పించాలి. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలి. అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చూడాలి' అని కలెక్టర్లు, ఎస్పీలను ఎస్ఈసీ ఆదేశించారు.

నామినేషన్‌తో పాటు ఎన్వోసీ, నో డ్యూస్ సర్టిఫికెట్ తప్పనిసరి కాదు

'నామినేషన్లు దాఖలుచేసే సమయంలో కేసుల్లేవని పోలీసుల నుంచి ఎన్వోసీ, పుర, నగరపాలక సంస్థలకు బకాయిలు లేనట్లుగా నిర్ధారించే నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వాలన్న నిబంధన ఎన్నికల నియమావళిలో లేదు. కొందరు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు ఎన్వోసీ, నో డ్యూస్ సర్టిఫికెట్ వెంటనే ఇవ్వాలంటున్నారని పలు రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ దృష్టికి తేవడంతో స్పష్టత ఇచ్చాం. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా అదనపు నిబంధనలు విధించకుండా అర్హులైన అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి' అని అధికారులను ఎస్ఈసీ ఆదేశించారు.

వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం



-మొదటిపేజీ తరువాయి

బోర్డు సమావేశాల్లో ప్రస్తావనకు రానున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించిన అంశాలు మరోమారు చర్చనీయాంశం కానున్నాయి. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం, రాష్ట్రాల మధ్య నీటి వాటాలు, ప్రాజెక్టుల అనుమతులు, పరస్పర ఫిర్యాదులపై చర్చించేందుకు ఈ నెలలో రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 26వ తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, 30వ తేదీన గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అధికారులు, ఇంజనీర్లు పాల్గొననున్నారు. ఇప్పటికే పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశాల్లో జరిగే చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీ అంశం మరోసారి కేఆర్ఎంబీ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాలపై ఇటీవల జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలోనూ ఏకాభిప్రాయం కుదరలేదు. ఈనెల 26న జరిగే బోర్డు సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చ జరగనుంది. రెండు రాష్ట్రాలు తమ వాదనలను బలంగా వినిపించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి వరకు 66, 34 నిష్పత్తిలోనే పంపకాలు జరగాలని ఏపీ అంటోంది. తెలంగాణ మాత్రం విభేదిస్తోంది. కృష్ణా బేసిన్ అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగా కేటాయింపులు జరగాలని అంటోంది. 70, 30 నిష్పత్తిన కృష్ణా జలాలు వినియోగించుకోవాలని తెలంగాణ కోరుతోంది. రెండు రాష్ట్రాల భిన్న వాదనల నేపథ్యంలో కేఆర్ఎంబీ సమావేశంలో జరగనున్న చర్చ కీలకం కానుంది.

ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశం

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో కొద్దిపాటి ప్రవాహాల నేపథ్యంలో నీటి నిర్వహణ కీలకంగా మారింది. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న జలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ జలాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని త్రిసభ్య కమిటీ సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలు, నీటి విడుదలకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరిగే అవకాశం ఉంది. సాగునీటి అవసరాలతోపాటు పట్టణాలు, గ్రామాల తాగునీటి అవసరాలను సమన్వయం చేసుకోవడం కూడా కీలకంగా మారింది. రెండు రాష్ట్రాల నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు ఉన్నాయి.

టెలిమెట్రీల ఏర్పాటుపై

గతంలో కృష్ణా బోర్డుకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. దాంతో ప్రాజెక్టుల ద్వారా నీటి వినియోగం, ఇతర అభ్యంతరాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది. కృష్ణా, గోదావరి నదులపై నిర్మించిన, నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి రెండు రాష్ట్రాలు ఇప్పటికే బోర్డులకు ఫిర్యాదులు చేశాయి. ప్రాజెక్టుల అనుమతులు, నీటి వినియోగం, నిబంధనల అమలు వంటి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. బోర్డు సమావేశాల్లో ఆయా ఫిర్యాదులను ప్రస్తావించి, సంబంధిత అంశాలపై స్పష్టత కోరే అవకాశం ఉంది. ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల స్థితి, బోర్డుల పరిధి, రాష్ట్రాలు పాటించాల్సిన మార్గదర్శకాలు వంటి అంశాలపై కూడా సమావేశాల్లో చర్చ జరిగే అవకాశం ఉంది. నదీ జలాల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు అంశం కూడా సమావేశాల్లో ప్రస్తావనకు రానుంది. గతంలో కొన్ని చోట్ల ఏర్పాటు చేసినప్పటికీ అందులో కొన్ని సరిగ్గా పనిచేయడం లేదు. వాటి స్థానంలో కొత్తగా ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు మరికొన్ని చోట్ల కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీంతో నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు అంశంపై కూడా చర్చ జరగనుంది.

నిధుల అంశంపై చర్చ జరిగే అవకాశం

కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల నిర్వహణ, బడ్జెట్‌కు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు రానున్నాయి. బోర్డులకు రెండు రాష్ట్రాల నుంచి రావాల్సిన నిధుల అంశంపై చర్చ జరగనుంది. ఈనెల 30న జరిగే గోదావరి బోర్డు సమావేశంలో పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్స్ అంశం కూడా ప్రస్తావకు వచ్చే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు కారణంగా ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు, ముంపు ప్రభావం, సంబంధిత ప్రాంతాలపై పడే పరిణామాలపై గతంలోనే తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. ఆ మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు అథారిటీ గతంలో తెలిపింది. జీఆర్ఎంబీ సమావేశంలో ఆ అంశంపై మరోమారు చర్చ జరిగే అవకాశం ఉంది. వీటితోపాటు రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఇతర అంశాలు కూడా.. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో చర్చకు రానున్నాయి.

రెబల్స్ బరిలో ఉంటే సస్పెన్షన్ వేటు తప్పదు

-మొదటిపేజీ తరువాయి

చేయాలన్న చంద్రబాబు, రెబల్స్‌గా నిలిచిన వాళ్లపై సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి విజయానికి అనుసరించాల్సిన వ్యూహంపై చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలతో దశల వారీగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జనసేన, బీజేపీ నేతలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు సాఫీగా జరిగేలా చూడాలని, మిత్రపక్షాల అధికారిక అభ్యర్థులు పోటీ చేస్తున్న చోట్ల కూడా రెబల్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం లోపించకుండా ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం: టికెట్లు ఆశించి దక్కించుకోలేకపోయిన వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా రెబల్స్‌గా నామినేషన్లు వేసిన వారు ఉపసంహరించుకోకుంటే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. 'చెప్పాం.. చేస్తున్నాం ' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని నేతలకు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచిని వివరించడంతో పాటు వైఎస్సార్సీపీ అరాచకాలను ప్రజలకు తెలియజేయాలని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని అన్నారు.

కోర్టు తీర్పులను సైతం వక్రీకరిస్తూ: రాజకీయాల్లో జగన్ లాంటి క్రిమినల్ లిటిగెంట్లు ఉంటే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు ఏర్పడతాయని చంద్రబాబు విమర్శించారు. తానే విధ్వంసానికి దిగుతూ, తిరిగి కోర్టులను ఆశ్రయించడం జగన్ లాంటి వారికే చెల్లుతుందని వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పులను సైతం వైఎస్సార్సీపీ వక్రీకరిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని, వికృత మనస్తత్వం కలిగిన వ్యక్తులతో రాజకీయం చేయాల్సి వస్తోందని విమర్శించారు. ఇలాంటి వారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తుంటే వైఎస్సార్సీపీ అధినేత బెంగళూరులో కూర్చొని విధ్వంసాలకు కుట్రలు చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. ఏ మున్సిపాలిటీలో ఎవరిని బరిలోకి దించాలనే దానిపై కూటమి నేతలు చర్చిస్తుంటే, ఏ ప్రాంతానికి, ఏ రాష్ట్రం నుంచి గుండాలను తీసుకురావాలనే ఆలోచనలో జగన్ ఉన్నారని విమర్శించారు. విధ్వంసాలకు పాల్పడి, వాటిని అడ్డుకునే ప్రయత్నం జరిగితే కోర్టులను ఆశ్రయించి ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి రాజకీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రచారానికి వారం రోజులే గడువు ఉండటంతో మిగిలిన సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని చంద్రబాబు నేతలకు సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని, అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని అన్నారు.

జగన్ వేసిన ట్రాప్‌లో చంద్రబాబు చిక్కుకున్నారా

పులివెందుల : స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే టీడీపీ, వైసీపీలు రెండూ ఒకే బాట పయనిస్తున్నాయి. అరాచకాలలో ఒకరిని మించి మరొకరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ పాలనపై విమర్శలు చేసే చంద్రబాబు నేడు జరుగుతున్న పరిస్థితులను అవతలి వారిపైకి నెట్టడం సమర్థనీయం కాదు. ఎన్నికలంటే శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదు. ఇప్పుడు జరుగుతున్న, జరిగిన పరిణామాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా చేష్టలుడిగి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంత ఉదాసీన వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఇవే పరిస్థితులు తలెత్తక మానవన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు కూడా చేస్తున్నారు.రాజకీయాలు చూడండి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం అధికార పార్టీది, విపక్ష పార్టీది ఒకే దారి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు వైసీపీ బాధిత పార్టీగా కనిపించవచ్చు. కానీ అదే తమ పాలనలో జగన్ ప్రభుత్వం అవలంబించిన చర్యలేవిటి? అని చంద్రబాబు ప్రశ్న కూడా అందరూ ఆలోచించాల్సిన విషయమే. అలాగే ఇదే విమర్శ రేపు చంద్రబాబు కూడా ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చు. నాడు కుప్పం నియోజకవర్గంలో జగన్ చేసిన పని, నేడు పులివెందులలో టీడీపీ చేసింది. ఇందులో తప్పు వెతుక్కోవడానికి ఇద్దరిలోనూ వెతికినా కనిపించవు. కానీ జనం మాత్రం వీటిని గమనిస్తూనే ఉంటారన్న విషయాన్ని మాత్రం వైసీపీ, టీడీపీలు మర్చి పోకూడదు. ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించాలంటే రెండు పార్టీల అధినేతలు ఎవరికి వారే ఆత్మవిమర్శలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ, వైసీపీ లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించుకోవాలని సహజంగానే భావిస్తుంది. అదే సమయంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత బలోపేతం అయితే రానున్న సాధారణ ఎన్నికలకు పుంజుకుంటామని భావన కారణంగానే ఈ రకమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నది కాదనలేని వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అందులో తప్పులేదు. కానీ హింసా రాజకీయాలకు స్వస్తి పలకాలి. అనుభవమున్నచంద్రబాబు కు ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. ఒకరకంగా జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా? అన్న అనుమానం కూడా చాలా మంది సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ నామినేషన్ల సందర్భంగానే చూశాం. ఇక జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఇంకెంత రగడ చూడాలో.. .దేవుడా ఏపీకి నీవే దిక్కు అని అనుకోవడం తప్ప చేసేదేమీ లేదు

వ్యూహాలు ప్రతివ్యూహాలతో

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాచికలు పారినట్లు కనపడుతుందివైఎస్ మోహన్ రెడ్డి వ్యూహాలు ప్రతివ్యూహాలతో సర్వసన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంది. దీంతో తాడిపత్రి మున్సిపాలిటీ తప్పించి అన్నింటా వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు టీడీపీ పాలనపై వ్యతిరేకత తెచ్చేందుకు, తమ పార్టీపై సానుభూతి కురిసేందుకు జగన్ వేసిన వ్యూహం సక్సెస్ అయినట్లే కనపడుతుంది. ప్రతి చోట ఖచ్చితంగా నామినేషన్లు వేయాలని, ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వనని జగన్ నాడు చేసిన హెచ్చరికలను వేరే విధంగా చూసిన వారికి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతుంది. జగన్ తన ఎత్తుగడలో భాగంగనే నామినేషన్లు వేయించి అభ్యర్థులను బరిలోకి దిగితే శాంతిభద్రతలు అదుపు తప్పి టీడీపీ పాలనపై వ్యతిరేకత ఏర్పడుతుందని అంచనా నిజమవుతుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల పర్వం చూస్తేనే ఇది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.మ్యాప్‌లు చూడండి ప్రతి సీటులోనూ పోటీకి... గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా, ఈసారి ప్రతి స్థానంలోనూ వైసీపీ అభ్యర్థిని పోటీకి నిలపాలని జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అధికార కూటమికి ఏకగ్రీవాలు చేసుకునే అవకాశం ఇవ్వకూడదని, ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో ఏకగ్రీవమైతే దానికి స్థానిక నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు పూర్తయి ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో అధికారికంగా ప్రకటించినప్పటికీ... వైఎస్ జగన్ మాత్రం ఒక అడుగు ముందే వేసి మొదటి విడతగా 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. గ్రౌండ్ రిపోర్టుల ఆధారంగా ప్రజాదరణ కలిగిన బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ కొత్త ఎత్తుగడలతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సమాచారం చూడండి.. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం లేదా పోలీస్ వ్యవస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను, అక్రమాలను తట్టుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక లీగల్ సెల్స్, మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా అధికార దుర్వినియోగ ఘటనలు జరిగితే వాటిని రికార్డ్ చేయడానికి 'డిజిటల్ డైరీ' విధానాన్ని తీసుకువచ్చారు.ఈ స్థానిక ఎన్నికలను కేవలం ఒక పోటీలా కాకుండా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుండి తిరిగి బలోపేతం చేసుకునే ఒక ప్రక్రియగా జగన్ భావిస్తున్నారు. అందుకోసం రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు చూసి క్యాడర్ లోనూ కసి పెరుగుతుందని, అది తమకు వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేశారు. అనుకున్నట్లుగానే క్యాడర్ ఏకతాటిపైకి రావడంతో జగన్ పాచిక పారినట్లయింది. అధికార కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుని పటిష్టంగా ఉన్న నేపథ్యంలో, జగన్ ముందస్తు వ్యూహాలు మరియు ఒంటరి పోరాటం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓటర్లను ఆకర్షిస్తాయనే దానిపైనే ఆయన "పాచిక" సక్సెస్ ఆధారపడి ఉంటుంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటే అది తమకు కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు జగన్.

మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ




నందిగామ, మహానగర్

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం, మున్సిపల్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత జడ్పీ హైస్కూల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, ఓటర్లు తమ పోలింగ్ బూత్‌లను సులభంగా గుర్తించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కె.వి.ఆర్. కళాశాలలో సిద్ధం చేస్తున్న స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి, స్ట్రాంగ్ రూముల్లోని కిటికీలను చెక్కలతో కాకుండా ఇటుకలతో పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ప్రజలకు, సిబ్బందికి వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన సూచిక బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి సమగ్ర శిక్షణ అందించాలని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు నియమావళిపై అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్డీవో జి. అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, నందిగామ, చందర్లపాడు ఎంపీడీవోలు, నందిగామ రూరల్ సీఐ, సర్వే శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులు వ్యయ నిబంధనలు పాటించాలి

విజయవాడ, మహానగర్



మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వ్యయ పరిశీలకులు ఎం. శివ ప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం విజయవాడ కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశతో కలిసి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జగ్గయ్యపేట, నందిగామ, కొండపల్లి, తిరువూరు ప్రాంతాల సహాయ వ్యయ పరిశీలకులు, వ్యయ పర్యవేక్షణ అకౌంటింగ్ బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థికి రూ.25 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థికి రూ.10 లక్షలు, నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేట, కొండపల్లి మున్సిపాలిటీల చైర్‌పర్సన్ అభ్యర్థులకు రూ.20 లక్షలు, వార్డు సభ్యుల అభ్యర్థులకు రూ.7.50 లక్షలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ అభ్యర్థులకు రూ.10 లక్షలు, వార్డు సభ్యులకు రూ.5 లక్షల చొప్పున వ్యయ పరిమితులు ఉన్నాయని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచి ఫలితాలు ప్రకటించే వరకు ప్రతిరోజూ ఎన్నికల ఖర్చులను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. వాహనాలు, ర్యాలీలు, మైకులు, ప్రచార సామగ్రి, వార్తాపత్రిక ప్రకటనల ఖర్చులను నిర్దేశిత ప్రొఫార్మాల్లో నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, పార్టీలు లేదా ఇతరులు అభ్యర్థి తరపున చేసిన ఖర్చులన్నీ అభ్యర్థి ఖాతాలోనే చేర్చబడతాయని స్పష్టం చేశారు. ఫలితాల ప్రకటనకు ముందే వ్యయ రిజిస్టర్లను కనీసం మూడుసార్లు తనిఖీ చేస్తామని, అభ్యర్థులు బిల్లులు, వోచర్లతో హాజరుకావాలని తెలిపారు. ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా, అంటే డిసెంబరు 13లోపు తుది వ్యయ ఖాతాలను సమర్పించాలని, నిబంధనలు ఉల్లంఘించినా, గడువులోగా లెక్కలు సమర్పించకపోయినా మూడేళ్లపాటు ఎన్నికల్లో పోటీకి అనర్హత విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణలో పారదర్శకత పాటించాలని, ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు.

ఎంప్లాయిస్ కాలనీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్, మహానగర్



ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా పండుగ సంబరాలను మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర శమీ వృక్షానికి పూజలు నిర్వహించగా, మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా పూలతో అలంకరించిన బతుకమ్మలతో ఆటపాటలతో సందడి చేశారు. అందంగా బతుకమ్మలను అలంకరించి తీసుకొచ్చిన మహిళలకు అసోసియేషన్ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మహిళలు, యువతులు, చిన్నారులు ప్రదర్శించిన దాండియా నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన రావణాసుర దహనం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి, మాజీ ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు సిద్ధప్ప, బీరప్ప, మీనా ముత్యాలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సంఘసేవకుడు సీతారాం ధూళిపాల, కాంగ్రెస్ యువనేత, ఐటీ సెల్ కార్యదర్శి వాసిరెడ్డి నరేష్, రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భూపతి, ఎంప్లాయిస్ కాలనీ అధ్యక్షుడు కుమ్మరి రమేష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణాచార్యులు, మనోజ్, ఆవుల అశోక్, సత్యనారాయణ, అజ్మతుల్లా, గోపాల్, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, సతీష్ రెడ్డి, శుభాని, వసంత, సీనియర్ పాత్రికేయుడు తిప్పరాజు రమేష్ బాబు, మాజీ అధ్యక్షుడు పెంటా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొని పండుగ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

ఒక్కో కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదగాలి: జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





విజయవాడ, మహానగర్

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదిగేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడంతో పాటు, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన అవకాశాలను కల్పించాలని అధికారులకు సూచించారు. పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా 2026లో భాగంగా, ఎంటర్ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ ఎస్సెన్షియేషన్ ప్రోగ్రామ్ లో భాగంగా ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ స్టాల్ (బయ్యర్, సెల్లర్ మీట్ గ్యాలరీ)లో బుధవారం మెప్మా, సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా పారిశ్రామికవేత్తలు, చేతివృత్తుల కళాకారులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను ఆసక్తిగా పరిశీలించి, వాటి తయారీ విధానం, నాణ్యత, మార్కెటింగ్ అవకాశాలు, విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు తయారు చేసిన బ్యాగులు, చెక్క బొమ్మలు, చెక్కతో రూపొందించిన వీణలు తదితర హస్తకళా ఉత్పత్తులను పరిశీలించిన కలెక్టర్, కళాకారుల నైపుణ్యాన్ని, ఉత్పత్తుల నాణ్యతను అభినందించారు. వినూత్నమైన ఉత్పత్తులను రూపొందిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్న మహిళలకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలను వ్యాపార రంగం వైపు మరింతగా ప్రోత్సహించాలని తెలిపారు. మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, కొనుగోలుదారులతో నేరుగా వ్యాపార సంబంధాలు ఏర్పడేలా చూడడం, వారి వ్యాపారాలను విస్తరించేందుకు అవసరమైన సహకారం అందించడం కీలకమని పేర్కొన్నారు. వచ్చే ఏడాది సరస్ మేళా నాటికి ప్రస్తుత సంఖ్యకు రెట్టింపు స్థాయిలో మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణ, ఉత్పత్తుల నాణ్యత పెంపు, మార్కెటింగ్ వంటి అంశాల్లో తగిన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడే వారి కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, తద్వారా సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. జాతీయ సరస్ మేళా వంటి వేదికలు మహిళా సంఘాల ఉత్పత్తులకు గుర్తింపు తీసుకురావడంతో పాటు, వారి వ్యాపారాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీఓ వి. శ్రీనివాసరావు రావు, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఏపీ డైరెక్టర్లు షీలా శ్రీనివాస్, భవ్య శర్మ, సెర్ప్ అదనపు సీఈఓ ఆర్. శ్రీరాములు నాయుడు, ఎన్టీఆర్ జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాంచార రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో పీవో, ఏపీవోల పాత్ర కీలకం

- ఎస్ఈసీ నిర్దేశించిన ప్రమాణాలతో విధులు నిర్వర్తించాలి
- శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి
- పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు) కీలక పాత్ర పోషిస్తారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికల సిబ్బంది శిక్షణలో భాగంగా బుధవారం తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో వీఎంసీ ఎన్నికల పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పరిశీలించి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ సమయంలో, ఆ తర్వాత నిర్వర్తించాల్సిన విధుల్లోని ప్రతి అంశంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణలో వివరించిన విధివిధానాలపై క్షుణ్ణంగా అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పోలింగ్ బృందం సభ్యుల మధ్య పటిష్ట సమన్వయం ద్వారా ప్రక్రియను విజయవంతంగా ముగించవచ్చని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా బ్యాలెట్ బాక్సు, బ్యాలెట్ పేపర్, పోలింగ్ మెటీరియల్, ఓటింగ్ ప్రక్రియ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల చట్టాల అమలుతో పాటు నిర్వహించాల్సిన రిజిస్టర్లు, అందించాల్సిన నివేదికలపైనా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా వివరించారు. శిక్షణ కార్యక్రమంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి డా. డి. హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రపై హైదరాబాద్ ఘన విజయం





విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుపై హైదరాబాద్ జట్టు 267 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. విజయవాడ సమీపంలోని మూలపాడు దేవినేని వెంకట రమణ ప్రణీత్ గ్రౌండ్‌లో అక్టోబరు 18 నుంచి 21 వరకు జరిగిన నాలుగు రోజుల పోరులో హైదరాబాద్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులు చేయగా, ఆంధ్ర జట్టు 184 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర తరపున షేక్ రషీద్ 114 బంతుల్లో ఎనిమిది ఫోర్లతో 61 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 95.3 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ ధాటికి నిలవలేకపోయింది. రెండో ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 130 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది. తనయ్ త్యాగరాజన్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టడంతో పాటు రెండో ఇన్నింగ్స్‌లోనూ కీలక వికెట్లు సాధించి రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 11 వికెట్లతో హైదరాబాద్ విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. అద్భుత బౌలింగ్ ప్రదర్శనకు గుర్తింపుగా అతనికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. మరోవైపు ఆంధ్ర జట్టు బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో షేక్ రషీద్ మినహా ఇతర బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు సాధించలేకపోగా, రెండో ఇన్నింగ్స్‌లోనూ స్వల్ప స్కోరుకే కుప్పకూలింది. దీంతో హైదరాబాద్ జట్టు 267 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసింది.

మహానగర్

మోదీ మాటల తూటాలపైనే గురి!



మోదీ ప్రభుత్వం అన్యాయాలు, అక్రమాలను ప్రతిఘటిస్తూ..నాటి ఆయన సూచనలను తు.చ తప్పక పాటిస్తున్నది 'సీజేపీ'! అంటే..ఆ పేరిట ఐక్యమైన భారత యువత! నాడు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించినట్టే..నేడు ప్రజాస్వామ్యం కోసం సమైక్యంగా ఉద్యమించింది దేశ యువత! శాంతియుతంగా ఉద్యమిస్తున్న వారి అణచివేతకు మోదీ, అమిత్ షా చేపట్టిన అప్రజాస్వామిక చర్యలు..నాడు స్వాతంత్ర్య ఉద్యమకారులపై క్రూర అణచివేతకు పూనుకున్న బ్రిటిష్ పాలకులను గుర్తుచేస్తున్నాయి! పరీక్ష పేపర్ల లీకేజీకి కారకుడైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరినట్టే..13 కోట్ల మంది ఓటర్లను తొలగించిన సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను కోరుతూ శాంతియుత నిరసనకు దిగింది యువత!-'ఓటర్ల లిస్టు నుంచి ఒక ఓటరు పేరు తొలగించడమంటే ఒక వ్యక్తి దేహం నుంచి అతని ఆత్మను తొలగించడమే!-నోటీసు ఇవ్వకుండా బతికున్న ఓటరును తొలగించడం రాజ్యాంగ విరుద్ధమే'నని ఉద్ఘాటించారు జస్టిస్ ఉజ్జల్ భుయాన్. నోటీసులు ఇవ్వకపోవడమే కాకుండా, సహ ఈసీలు సుఖ్‌బీర్ సింగ్, వివేక్ జోషిల అభ్యంతరాలను కూడా లెక్కచేయక, చట్టబద్ధంగా మార్చవలసిన 'ఫారమ్ 6-7-8'లను ఏకపక్షంగా మార్చి, 14 శాతం ఓటర్లను తొలగించడం జ్ఞానేశ్ అతి పెద్ద అప్రజాస్వామిక చర్య! ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ రితికా చోప్రా ఏడాదిపాటు పరిశోధించి-'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ద్వారా జ్ఞానేశ్ గుట్టును రట్టు చేయడంతో దేశం ఉలిక్కిపడింది! ఈ కుట్ర గురించి ప్రతిపక్షాలు, సీజేపీ సంధిస్తున్న ఏ ఒక్క ప్రశ్నకూ జవాబు చెప్పలేక, మౌనం వహించడం ద్వారా జ్ఞానేశ్ తప్పులను అంగీకరించకనే అంగీకరించినట్లయ్యింది మోదీ సర్కార్.

అసలీ తప్పుల్ని జ్ఞానేశ్ చేత చేయించింది మోదీ, అమిత్ షాలేనని సీజేపీ సహా బీజేపీయేతర పార్టీలన్నీ ముక్తకంఠంతో చెప్తున్నాయి! ఐనా సరే సదరు ఆరోపణలు అవాస్తవాలను సహేతుకంగా నిరూపించి, ప్రజాస్వామ్యం బతికే ఉన్నదని ప్రజలకు విశ్వాసాన్ని కలిగించాల్సిన మోదీ ప్రభుత్వం-తమను నిలదీసిన ప్రత్యర్థులను కేసులతో, తమ గుట్టును రట్టు చేస్తున్న జర్నలిస్ట్‌లను చిత్రహింసలతో, శాంతియుత నిరసనకారులను పోలీసులతోనే కాకుండా ప్రైవేట్ గూండాలతో చితగ్గొట్టిస్తూ..అధికారాన్ని నిలబెట్టుకుంటున్నారు.

కార్పొరేట్ల కోసం పరిశ్రమిస్తున్న తమ పార్టీ, ప్రజాభిమానంతో గద్దెనెక్కడం అసాధ్యమన్న వాస్తవం మోదీ, అమిత్ షాకు తెలుసు! అందుకే రాజ్యాధికారం కోసం పలు మాయోపాయాలను రూపొందించుకున్నది బీజేపీ. ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని అదృశ్యం చేసే అతి పెద్ద కుట్ర ఏమంటే? తమ ఈసీ జ్ఞానేశ్ ద్వారా బీజేపీ వ్యతిరేక ఓట్లను కోట్లలో తొలగించడం-తమ ఈవీఎంల రిగ్గింగ్‌కు తోడ్పడేలా లక్షలాది దొంగఓట్లను చేర్పించడం ద్వారా ఎట్టిపరిస్థితుల్లోనూ, ఎప్పటికీ బీజేపీనే గద్దెనెక్కించే దిశగా ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేశారు మోదీ, అమిత్ షా!ఈ ప్రమాదం నుంచి భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కదనరంగంలో దూకింది సీజేపీ! నాడు మన్‌మోహన్ ప్రభుత్వాన్ని గద్దెదించేదాకా యువతను కదం తొక్కించిన నాటి మోదీ మాటల తూటాలనే నేడు ప్రభుత్వానికి గురిపెట్టింది సీజేపీ! వీరోచిత సీజేపీ వెంటే బీజేపీయేతర పార్టీలన్నీ కదం తొక్కుతున్నాయ్! విజయాభవ సీజేపీ! అభీష్ట సిద్ధిరస్తు సీజేపీ!

రాహుల్ అమెరికన్ ఎత్తుగడలు



నీట్ పరీక్షల అవకతవకలను నిరసిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ జూన్-జూలై నెలల్లో ప్రారంభించిన ఉద్యమానికి అనూహ్యమైన, అపూర్వమైన స్పందన రావడం తెలిసిందే. స్పందించిన వారిలో అత్యధికులు యువతీయువకులు. విద్యాశాఖ మంత్రి రాజీనామాను సాధించడంతో సీజేపీ ప్రతిష్ట ఆకాశాన్నంటింది. ఆ వెంటనే వారు స్కూల్ ఠీక్ కరో కార్యక్రమాన్ని చేపట్టి, విద్యారంగం పరిస్థితి ఎంత అధ్వానంగా ఉన్నదో వీడియో ఆధారాలతో దేశం ముందుకు తేవడంతో వారి పట్ల గౌరవం మరింత పెరిగింది. ఆ కార్యక్రమం సాగుతుండగానే ఓటర్ల జాబితా సవరణ ఒక కుంభకోణంగా వెల్లడి కావడంతో దానిని సీజేపీ సీరియస్‌గా తీసుకుని యువతను భారీ ఎత్తున కదిలించింది. ఇట్లా వరుసగా జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో వారెక్కడా రాజీపడకపోవడం, తీవ్రమైన పోలీస్ అణచివేతలకు భయపడకపోవడం, మోదీ ప్రభుత్వాన్ని సాహసోపేతంగా ధిక్కరిస్తూ ఉండడంతో యువతరంతోపాటు సమాజానికి కూడా ఒక కొత్త ఆశా కిరణంగా రూపు తీసుకోసాగారు. సరిగ్గా ఇక్కడ మొదలయ్యాయి రాహుల్‌గాంధీ ఎత్తుగడలు. కాక్రోచ్‌లు జరుపుతూ వస్తుండిన కార్యక్రమాలను (స్మూళ్ల సమస్య మినహా) కాంగ్రెస్ కూడా చేసినప్పటికీ అవి ఒక పరిమిత స్థాయిలో రొటీన్‌గా సాగి మిగిలిపోయాయి. అందుకు కారణం కాంగ్రెస్ పట్ల విశ్వాసమన్నది ఎప్పటి నుంచో సన్నగిల్లుతుండటం. ఇటువంటి పరిస్థితుల మధ్య రాహుల్ గాంధీ బృందానికి, దేశ యువతరం కాక్రోచ్‌ల వైపు మళ్లటం, వారి ఆకర్షణ క్రమంగా విస్తరిస్తుండటం సమస్యగా మారింది. దానితో సీజేపీని తమ దారికైనా తెచ్చుకోవాలి, లేదా ఆ సంస్థకు ఏవో ముద్రలు వేసి బదనాం చేయాలనే ఎత్తుగడలు మొదలుపెట్టారు. వారు లొంగి వచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో సీజేపీ అనేది బీజేపీకి బీ-టీమ్ అనే ప్రచారాలు మొదలుపెట్టారు. ఆ సంస్థలోని ముఖ్యులు కొందరు లోగడ ఆప్‌లో పని చేసిన వారైనందున 'ఆప్‌కు బీ-టీమ్' అని కూడా అన్నారు. కానీ అవేవీ పనికిరాలేదు. ఆ విధంగా రాహుల్ ఎత్తుగడలు విఫలమయ్యాయి. ఉదాహరణకు సీజేపీ, ఏఐఎస్ఏ చేపట్టిన మొదటి అంశం పరీక్షా పత్రాల లీక్ కాగా, అది ప్రస్తుత బీజేపీ హయాంలోనే గాక లోగడ కాంగ్రెస్ పాలనలోనూ జరిగిందని వారు గుర్తు చేశారు. అదే విధంగా 'స్మూల్ ఠీక్ కరో' కార్యక్రమం మొదలుపెట్టినప్పుడు, ప్రభుత్వ పాఠశాలల తీవ్రమైన దుస్థితి కాంగ్రెస్ పాలన రోజుల నుంచి నేటికీ కొనసాగుతున్నదని విమర్శలు చేశారు. ఆందోళనల అణచివేత ఏదో ఒక స్థాయిలో బీజేపీ కన్నా ముందు కూడా కనిపించిందన్నారు. దానితో ఇటీవల ఒక కొత్త ఎత్తు మొదలుపెట్టారు. అది ద్విముఖవ్యూహం. ఏకకాలంలో ఒకవైపు సీజేపీపై ఎవరికో బీ-టీమ్ అనే ప్రచారం చేస్తూ, మరొకవైపు వారిని మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నించడం. ఆ విధంగా ప్రచారమన్నది యథాప్రకారం సాగిస్తూనే, తమ నిరసన కార్యక్రమాలకు సీజేపీని ఆహ్వానించడం మొదలుపెట్టారు. సీజేపీపై అణచివేతలను ఖండించారు. యువతరం తన ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. వారికి తాము మద్దతుగా నిలుస్తామన్నారు. ఇంకా అటువంటివే. తమ గత వారపు నిరసన ప్రదర్శనలో ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా పాల్గొనడంతో రాహుల్‌కు సీజేపీ విషయమై కూడా కొత్త ఆశలు కలిగాయి. ఆ సంస్థ నాయకత్వానికి రాయబారాలు పంపారు. కానీ ఇవేమీ కూడా కాక్రోచ్ నాయకత్వ వైఖరిని మార్చలేకపోయాయి. మొదట నేహా బోరా తాము కాంగ్రెస్ నిరసనలో పాల్గొనడం సర్ సమస్యకు పరిమితమైనదే తప్ప, ఆ పార్టీతో కలిసే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు. ఆ తర్వాత సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే కూడా కాంగ్రెస్ కార్యక్రమంలో బయటి నుంచి ఏకీభవిస్తామని, ఆ పార్టీని వ్యతిరేకించబోమని, అంతేగానీ వారితో కలవబోమన్నారు.

ఈ సంస్థల వైఖరికి స్పష్టమైన కారణాలున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, భారతదేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు కాంగ్రెస్ సహా అన్ని పార్టీలదీ బాధ్యత ఉన్నదన్నది ఈ సంస్థల నాయకులు తరచూ ఎత్తిచూపుతున్న విషయం. ఉదాహరణకు సీజేపీ, ఏఐఎస్ఏ చేపట్టిన మొదటి అంశం పరీక్షా పత్రాల లీక్ కాగా, అది ప్రస్తుత బీజేపీ హయాంలోనే గాక లోగడ కాంగ్రెస్ పాలనలోనూ జరిగిందని వారు గుర్తు చేశారు. అదే విధంగా 'స్మూల్ ఠీక్ కరో' కార్యక్రమం మొదలుపెట్టినప్పుడు, ప్రభుత్వ పాఠశాలల తీవ్రమైన దుస్థితి కాంగ్రెస్ పాలన రోజుల నుంచి నేటికీ కొనసాగుతున్నదని విమర్శలు చేశారు. ఆందోళనల అణచివేత ఏదో ఒక స్థాయిలో బీజేపీ కన్నా ముందు కూడా కనిపించిందన్నారు.

అటువంటి స్థితిలో వారు కాంగ్రెస్‌తో చేతులు కలిపి పని చేయడం సాధ్యమయ్యేది కాదు. వాంఛనీయం కూడా కాదు. వారు ఆ పని చేసినట్టయితే యువత దృష్టిలో, ప్రజల దృష్టిలో తమ విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉన్నది. స్వయంగా కాంగ్రెస్ తన విశ్వసనీయతను కోల్పోతున్నప్పుడు వారితో కలవకపోవడమే సరైన నిర్ణయం అవుతుంది. అయితే దీప్కే, నేహా బోరా స్వయంగా స్పష్టం చేసినట్టు 'సర్' అనేది సార్వత్రిక సమస్య అయినందున అందుకు పరిమితమై కాంగ్రెస్‌తో సంఘీభావాన్ని చూపడం వరకు పొరపాటు ఉండదు. పోతే, ఈ సంస్థల కార్యక్రమాలు ఈ రెండు, మూడు అంశాలకు పరిమితమైనవి కావు. వారికి దీర్ఘకాలిక ప్రణాళికలున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఒక స్పష్టమైన లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ సామాజిక వేదికగా రూపొందుతుండగా, నేహా బోరా సంస్థ ఒక మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీకి అనుబంధమైనది. కాంగ్రెస్ కూడా మొదటి నుంచి లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ పార్టీ అయినా, గత 30 ఏండ్లుగా ఆ మార్గం నుంచి దారి మళ్లుతూ వస్తున్నది. కనుక ఈ సంస్థలకు కాంగ్రెస్‌తో మైత్రి అనేది అసంబద్ధ విషయం.

అయినప్పటికీ, చింతచచ్చినా అధికారపు కోరికల పులుపు చావని రాహుల్‌కు వేస్తూ వస్తున్న ఎత్తుగడల్లో ఒకటి, ఇతర ప్రతిపక్షాలను 'మీరు మాతో లేకుంటే బీజేపీతో ఉన్నట్టే, వారికి బీ-టీమ్ అయినట్టే' అని ఆరోపించడం. కానీ ఈ చవకబారు ఎత్తుగడలు పని చేయడం లేదు. కాంగ్రెస్ వాళ్లు ఇదే మాట బీఆర్ఎస్ గురించి కూడా అనడం తెలిసిందే. ఆప్, టీఎంసీ వంటివి కూడా ఈ ప్రచారానికి గురయ్యాయి. ప్రస్తుతం కాక్రోచ్‌లను కాంగ్రెస్ లక్ష్యం చేసుకున్నారు. తమ అధికారం కోసం వారిని కబలించాలన్నది ఎత్తుగడ. రాహుల్ గాంధీ ప్రదర్శిస్తున్న ఇటువంటి అసమర్థ దుర్జనత్వ ఎత్తుగడలు కూడా 'ఇండి' కూటమి గందరగోళానికి ఒక ముఖ్య కారణం. సీజేపీ విషయానికి వస్తే, ఆ సంస్థపై ఈ తరహా కుయుక్తుల వల్ల తాము యువతరానికి, సమాజానికి మరింత దూరం కాగలమనే వివేకం రాహుల్ గాంధీకి కలుగడంలేదు.

దక్షిణాదిలో కాక్రోచ్ ఉద్యమాలకు జీరో క్రేజ్

ఢిల్లీ కేంద్రంగా జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తూ, ఉత్తరాది ప్రసార మాధ్యమాల్లో రోజంతా అగ్రస్థానంలో నిలుస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాలు దక్షిణాది రాష్ట్రాలకు వచ్చేసరికి పూర్తిగా నిస్తేజంగా మారాయి. ఢిల్లీ విధుల్లో సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మిమ్‌ల ఆధారంగా సాగుతున్న ఈ వినూత్న పొలిటికల్ ట్రెండ్స్‌ను నేషనల్ మీడియా సర్వస్వంగా భావించి ప్రసారం చేస్తున్నప్పటికీ, దక్షిణాదిలో మాత్రం దీనికి కనీస ఆదరణ కూడా లభించడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి ప్రధాన దక్షిణ భారత ప్రాంతాల్లో ఈ ఉద్యమం కనీస ప్రభావం చూపలేక చతికిలబడింది. ఇక్కడి స్థానిక మీడియా సంస్థలు అక్కడక్కడ కొన్ని వార్తలు ప్రచురించే ప్రయత్నం చేసినా, సాధారణ ప్రజానీకం, యువత దీనిని ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.ఢిల్లీ , ఉత్తరాదిలోని ప్రధాన నగరాల్లో భారీగా వైరల్ అవుతున్న ఈ ట్రెండ్‌ను దక్షిణాది సమాజం, ముఖ్యంగా ఇక్కడి యువత పూర్తిగా తిరస్కరించడానికి ఇక్కడి ప్రత్యేకమైన సామాజిక, ఆర్థిక పరిస్థితులే ప్రధాన కారణమని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉత్తరాదిలోని రాజకీయ వాతావరణం, అక్కడి నిరుద్యోగ నిరసన తీరుకు, దక్షిణాది యువత ఆలోచనా ధోరణికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంది. కాలక్షేపం కోసమో లేదా సోషల్ మీడియాలో సంచలనం కోసమో చేసే ఉద్యమాల కంటే.. తమ ఉజ్వల భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి , ఆర్థిక స్వావలంబనే ప్రాథమిక లక్ష్యమని భావించే దక్షిణాది యువత ప్రాగ్మాటిక్ ఆలోచనా విధానమే ఈ కాక్రోచ్ ఉద్యమాలు ఇక్కడ అడుగుపెట్టకుండా నిరోధించింది. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులు సుదీర్ఘకాలంగా సమాచార సాంకేతిక రంగం , తయారీ రంగం, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు , స్టార్టప్ రంగానికి కేంద్రబిందువులుగా ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో యువత తమ దృష్టినంతా కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , కొత్త నైపుణ్యాల అప్‌గ్రేడేషన్ . ఐటీ, గ్లోబల్ పరిశ్రమల్లో అవకాశాల సాధనపైనే నిలుపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ నిరసనల పేరిట కాలం వృథా చేసుకోవడం కంటే, గ్లోబల్ మార్కెట్‌లో తమ అర్హతలను పెంచుకోవడం మరియు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.దక్షిణాదిలో ప్రాంతీయ రాజకీయ చైతన్యం చాలా బలంగా ఉంటుంది. తమిళనాడులోని ద్రవిడ సిద్ధాంతం, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లలోని బలమైన స్థానిక ప్రాంతీయ పార్టీలు, శ్రేణుల నిర్మాణం కారణంగా.. బయటి నుంచి దిగుమతి అయ్యే డిజిటల్ పొలిటికల్ సటైర్ ఉద్యమాలకు ఇక్కడ స్వతంత్ర స్పేస్ లభించడం లేదు. క్షేత్రస్థాయి సమస్యలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు మరియు ప్రాజెక్టుల పురోగతిపైనే ఇక్కడి రాజకీయ చర్చలు నడుస్తాయి తప్ప, ఢిల్లీ వీధుల్లో పుట్టుకొచ్చే తాత్కాలిక మిమ్ ట్రెండ్స్ ఇక్కడి ప్రజల మద్దతును పొందలేవు.ఢిల్లీలో పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ ప్రధానంగా ఎక్స్ , ఆన్‌లైన్ నిరసనలకు పరిమితమైన ఒక ట్రెండ్ మాత్రమే. దక్షిణాది యువత డిజిటల్ మాధ్యమాలను విజ్ఞానార్జనకు, గిగ్ ఎకానమీలో అవకాశాలకు, లేదా వినోదానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు తప్ప, తమ భవిష్యత్తును పణంగా పెట్టి అర్థం లేని ఉద్యమాల వెనుక పరిగెత్తడం లేదు. పొరుగున ఉన్న విద్యార్థులు, యువత నైపుణ్య ఆధారిత కోర్సులు, పోటీ పరీక్షల శిక్షణపై దృష్టి సారించడాన్ని ఇక్కడ ప్రాధాన్య అంశంగా చూస్తున్నారు. దక్షిణాదిలో యూత్ ఎందుకు వీటిపై ఆసక్తి చూపడం లేదో పరిశీలిస్తే.. ఇక్కడి యువత ఎప్పుడూ ఖాళీగా ఉండరనే వాస్తవం స్పష్టమవుతుంది. ఐటీ రంగాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, పారిశ్రామిక కారిడార్లు, సాంకేతిక , సేవారంగాలు విస్తరించి ఉన్న దక్షిణ భారతదేశంలో యువత తమ కెరీర్ నిర్మాణమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. గ్లోబల్ కాంపిటీషన్ ఎదుర్కొంటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తీవ్రంగా శ్రమించే యువతకు, ఇలాంటి ప్రయోగాత్మక, వ్యంగ్య రాజకీయ ఉద్యమాల వైపు దృష్టి పెట్టేందుకు సమయం ఉండదు. కేవలం సోషల్ మీడియాలో రీక్రియేషన్ కోసం చూసి వదిలేయడమే తప్ప, వీటిని సీరియస్‌గా తీసుకునేంత ఖాళీ వాతావరణం ఇక్కడ కనిపించదు.అంతేకాకుండా, దక్షిణ భారతదేశంలోని విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల రాజకీయాల ప్రభావం ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే చాలా తక్కువ. క్యాంపస్‌లలో ప్రత్యక్ష రాజకీయాల ప్రమేయం, యూనివర్సిటీల జోక్యం చాలా వరకు పరిమితంగా ఉంటుంది.విద్యార్థులు చదువు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఉన్నత చదువుల వైపు దృష్టి సారిస్తారే తప్ప, ఇలాంటి నిరసనలు, అరాచక తరహా ఉద్యమాల వైపు ఆకర్షితులు కారు. కాలేజీ రోజుల్లోనే భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత ఉండే దక్షిణాది విద్యార్థులు, భావోద్వేగాల కంటే కెరీర్ నిలదొక్కుకోవడానికే తొలి ప్రాధాన్యత ఇస్తారు.మరోవైపు, దక్షిణాది రాజకీయ సంస్కృతి కూడా పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇక్కడ ప్రాంతీయ పార్టీల ప్రభావం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆధారిత రాజకీయాలే తప్ప, ఇలాంటి విచిత్రమైన నామకరణాలతో కూడిన ఉద్యమాలు స్థానిక ప్రజలను ఆకట్టుకోలేవు. ఉత్తరాదిలో నిరుద్యోగ నిరాశ నిస్పృహల నుంచి పుట్టుకొచ్చిన కొన్ని వ్యంగ్య ధోరణులు అక్కడ చర్చనీయాంశం కావొచ్చు, కానీ ప్రయోజనాత్మక దృక్పథం కలిగిన దక్షిణ భారతదేశం మాత్రం ఇలాంటి ట్రెండ్స్‌ను ఎప్పుడూ పక్కన పెడుతూ వస్తోంది. మీడియా ఎంతగా హోరెత్తించినా దక్షిణాదిలో కాక్రోచ్ ఉద్యమాలకు జీరో క్రేజ్ దక్కడం వెనుక ఇక్కడి యువత మెచ్యూరిటీ స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం కాలక్షేపం కంటెంట్ కంటే తమ ఉజ్వల భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబనే ముఖ్యమని భావించే ఇక్కడి యువత ఆలోచనా విధానమే, ఈ ఉద్యమాలను ఇక్కడ కనీస ప్రభావం కూడా చూపకుండా అడ్డుకుంటోంది. ఉత్తరాది మీడియా ఎంత హడావుడి చేసినా, దేశీయ రాజకీయాల్లో ప్రభావం చూపుతుందని ప్రచారం చేసినా, దక్షిణాది ప్రగతిశీల సమాజం దానికి పూర్తిగా దూరంగా నిలిచింది. కేవలం డిజిటల్ సంచలనాల ఆధారంగా నడిచే రాజకీయ ఉద్యమాలకు కాలం చెల్లిందని, ప్రగతి సాధన, ఆర్థిక పురోగతే ఏకైక అజెండా అని దక్షిణాది యువత తమ నిశ్శబ్ద తిరస్కరణ ద్వారా మరోసారి స్పష్టం చేసింది.

దిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

దేశ రాజధాని దిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ) స్టేజ్-1ను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) బుధవారం ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం

దిల్లీలో అక్టోబర్ 20న వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 179గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీ పరిధిలోకి వస్తుంది. అయితే అక్టోబర్ 21న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సూచీ 244కు చేరింది. దీంతో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోకి వెళ్లింది. ఒక్కరోజు వ్యవధిలోనే కాలుష్య స్థాయిలు గణనీయంగా పెరగడం అధికారులను అప్రమత్తం చేసింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లోనూ దిల్లీలో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిని సమీక్షించిన, భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు కాలుష్యాన్ని మరింత పెరగకుండా నిరోధించేందుకు తొలి దశ చర్యలను అమలు చేయాలని నిర్ణయించింది.

జీఆర్ఏపీ స్టేజ్-1 ఎందుకు?

వాయు కాలుష్యం పెరుగుతున్నప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి దశలవారీగా చర్యలు చేపట్టే విధానమే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్. గాలి నాణ్యత ఆధారంగా వివిధ దశల్లో నియంత్రణ చర్యలను అమలు చేస్తారు. ప్రస్తుతం దిల్లీలో ఏక్యూఐ 244కు చేరడంతో తొలి దశను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ నిర్ణయం దిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వర్తిస్తుందని సీఏక్యూఎం స్పష్టం చేసింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, అమలు చేసే ఇతర విభాగాలు తమ పరిధిలోని చర్యలను పర్యవేక్షించాలని



ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. గాలి నాణ్యత మరింత దిగజారకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపింది. పౌరులు కూడా జీఆర్ఏపీ స్టేజ్-1లో సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది.

పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం

దిల్లీతో పాటు ఎన్‌సీఆర్‌లో గాలి నాణ్యతను అధికారులు నిరంతరం గమనిస్తారని సీఏక్యూఎం తెలిపింది. వాయు కాలుష్య స్థాయిలు, వాతావరణ శాఖలు వెల్లడించే భవిష్యత్ అంచనాలను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. అవసరాన్ని బట్టి అదనపు చర్యలపై సమీక్ష ఉంటుందని వెల్లడించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. జీఆర్ఏపీ తొలి దశ అమలుతో కాలుష్య నియంత్రణకు సంబంధించిన ప్రస్తుత చర్యలను ముమ్మరం చేయడంపై అధికారులు దృష్టి సారించనున్నారు.

గత పదేళ్లలో కాలుష్యం తీవ్ర సమస్య: మంత్రి

దిల్లీలో వాయు కాలుష్యంపై పర్యావరణ శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేళ్ల నుంచి 12 ఏళ్ల కాలంలో రాజధానిలో గాలి నాణ్యత తీవ్రంగా దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాలు కాలుష్యానికి పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్ వంటి రాష్ట్రాలను బాధ్యులుగా చూపుతూ వచ్చాయని, అయితే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేకపోయాయని విమర్శించారు. అదే సమయంలో ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు 214 రోజులు 'గుడ్' లేదా 'మోడరేట్' కేటగిరీల్లో గాలి నాణ్యత నమోదైందని మంత్రి వెల్లడించారు. కొవిడ్ ప్రభావిత సంవత్సరాన్ని మినహాయించి చూస్తే, గత 12 ఏళ్లలో ఇదే అత్యధికమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలతో పాటు దిల్లీ ప్రజల సహకారం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని తెలిపారు.

ఆందోళనలు హింసకు దారితీస్తాయి

ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా దాఖలు చేసిన పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు కీలక సూచనలు చేసింది. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద విచారణ పూర్తయ్యే వరకు వేచి చూడాలని పేర్కొంది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే అప్పీలేట్ కోర్టును ఆశ్రయించాలని జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ధర్మాసనం సూచించింది. అలాగే ఫ్రాన్స్‌లో విద్యార్థుల ఆందోళనలు అగ్నిప్రమాదాలు, దోపిడీలకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీంతో సీజేపీ నేతలు హైకోర్టులో తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోశ్ రాంకాలను అక్టోబర్ 13న పోలీసులు అరెస్టు చేశారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టే క్రమంలో వారు పోలీసుల బారికేడ్లను దాటి అక్కడికి ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేసినట్లు పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశంగా గుర్తించిన అనుమతులను రద్దు చేసిన తర్వాత అక్కడికి వెళ్లడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ న్యాయ కస్టడీని పొడిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీజేపీ నేతలు దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వారి కస్టడీ గడువు బుధవారంతో ముగియున్న నేపథ్యంలో పిటిషన్?ను అత్యవసరంగా విచారించేందుకు న్యాయస్థానం అంగీకరించింది. అయితే ప్రత్యామ్నాయ న్యాయ మార్గాలను అనుసరించకుండా నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం ప్రశ్నించింది. సంబంధిత ఎస్ఈఎం విచారణ కోసం వేచి చూడాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించింది. దీంతో పిటిషనర్లు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

బారికేడ్లు దాటడంపై కోర్టు అభ్యంతరం

జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం నిరసనల నిర్వహణలో పోలీసుల అనుమతి ప్రాధాన్యాన్ని వివరించింది. జంతర్‌మంతర్ నిరసన ప్రదేశంగా గుర్తింపు కోల్పోయిన తర్వాత కూడా అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించింది. బారికేడ్లను ఏర్పాటు చేయడం వెనుక నిర్దిష్టమైన ఉద్దేశం ఉంటుందని, వాటిని దాటడం వల్ల ఇతరులు కూడా ఆ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొంది. నిరసనకారుల నియంత్రణలో లేని



వ్యక్తులు అక్కడికి చేరితే పరిస్థితులు సంక్షిష్టంగా మారవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. ఆందోళనకు సంబంధం లేని వారు ప్రవేశించి గందరగోళం సృష్టిస్తే, దాని ప్రభావం అసలు నిరసనకాలపైనా పడే ప్రమాదం ఉంటుందని సూచించింది. నిరసనలకు అనుమతి తీసుకోవడం అనేది ఆందోళనలను అడ్డుకోవడానికి మాత్రమే కాదని కోర్టు స్పష్టం చేసింది. ఇతరులు వచ్చి పరిస్థితులను చెడగొట్టకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడటం కూడా పోలీసుల అనుమతి విధానంలో కీలక ఉద్దేశమని వివరించింది.

ఫ్రాన్స్ అల్లర్లతో పోలిక ఎందుకు?

విద్యార్థుల ఆందోళనలుగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మక ఘటనలకు దారితీసిన ఉదంతాలు దేశ సరిహద్దులకు పరిమితం కాలేదని హైకోర్టు పేర్కొంది. ఫ్రాన్స్‌లో విద్యార్థుల నేతృత్వంలో మొదలైన నిరసనలు చివరకు నిప్పంటించే ఘటనలు, దోపిడీలకు దారితీసిన పరిణామాలను ఉదాహరణగా ప్రస్తావించింది. నిరసన ప్రారంభమైనప్పుడు దాని ఉద్దేశం ఒకటిగా ఉన్నా, ఆ తర్వాత పరిస్థితులు మారే అవకాశం ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు నిరసన నిర్వాహకులు ఎవరు? వారి అనుబంధ సంస్థ ఏమిటి? ఆ సంఘం లక్ష్యాలేంటి? అనే అంశాలు ప్రాధాన్యం సంతరించుకుంటాయని పేర్కొంది. అయితే, నిషేధం లేదా అనుమతి రద్దు చేసిన ప్రదేశంలో నిరసన చేపట్టడం ఎంతవరకు తీవ్రమైన చర్యగా పరిగణించాలనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. బారికేడ్లు దాటి వెళ్లిన వ్యవహారంపై చట్టపరమైన అంశాలను ప్రత్యేకంగా పరిశీలిస్తామని తెలిపింది. నిరసన నిర్వహించిన తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆ చర్యల చట్టబద్ధతను పరిశీలించడం వేరే అంశమని ధర్మాసనం పేర్కొంది.

'మీరు జెన్-జెడ్ కాదు'

విచారణ సందర్భంగా సీజేపీ నేతల వయసును కూడా ధర్మాసనం అడిగి తెలుసుకుంది. సౌరవ్ దాస్ వయసు 26 ఏళ్లు కాగా, అశుతోశ్ రాంకా వయసు 31 ఏళ్లు. వారి వయసుల నేపథ్యంలో మీరు జెన్-జెడ్ తరానికి చెందినవారు కాదని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి మిలీనియల్స్ ఏ వయో వర్గానికి చెందుతారని సరదాగా ప్రశ్నించారు. విద్యార్థుల ఉద్యమంగా మొదలైన నిరసన క్రమంగా వేరే స్వరూపం సంతరించుకుందనే విషయాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. నిరసనలో పాల్గొనే వ్యక్తులు మారకపోయినా, వారి ఆందోళనకు సంబంధించిన కారణాలు మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. శాంతిభద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందనే అనుమానం ఏర్పడినప్పుడు నిర్వాహకుల నేపథ్యం, సంస్థ లక్ష్యాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించింది.

అంగరంగా వైభవంగా 'జంబూ సవారీ'

మైసూరులో ఘనంగా దసరా సంబరాలు

కర్ణాటకలోని మైసూరు నగరం విజయదశమి వేడుకలతో సందడిగా మారింది. 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన మైసూరు దసరా ఉత్సవాల ముగింపు ఘట్టంలో భాగంగా బుధవారం విజయదశమి ఊరేగింపు ప్రారంభమైంది. రాష్ట్ర పండుగగా జరుపుకునే ఈ ఉత్సవాలు కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వపు రాజవైభవాన్ని ప్రతిబింబించాయి. సాయంత్రం జరిగే ప్రసిద్ధ 'జంబూ సవారీ'ని వీక్షించేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. 'ప్రశాంత' అనే ఏనుగు నేతృత్వంలో అలంకరించిన 12 ఏనుగులు ఈ ఊరేగింపులో పాల్గొననున్నాయి. 750 కిలోల బరువున్న బంగారు పూత పూసిన అంబారీలో చాముండేశ్వరి దేవి విగ్రహాన్ని ఉంచి ఊరేగించడం ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మైసూరు దసరా వేడుకలను వీక్షించేందుకు వివిధ దేశాలకు చెందిన దౌత్యవేత్తలు, విదేశీ ప్రముఖులు హాజరయ్యారు. యూరోపియన్ యూనియన్ రాయబారి జీన్-ఎరిక్ పాక్వెట్, చైనా రాయబారి జు ఫీహాంగ్, భారతదేశంలో ఈక్వెడార్ రాయబారి ఫెర్నాండో బుచెలి, మొజాంబిక్ హైకమిషనర్ అర్మాండో పెడ్రో, బల్గేరియా రాయబారి నికోలే యాంకోవ్, బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ హర్ష్‌వీర్ సంఘా ఈ కార్యక్రమానికి వచ్చిన వారిలో ఉన్నారు. కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ్ రాయరెడ్డి వారికి స్వాగతం పలికారు. డానిష్ కాన్సుల్ జనరల్ పీటర్ వింతర్, ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ ఓర్లీ వీట్జ్‌మాన్, ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్, అర్మేనియా రాయబార కార్యాలయ కౌన్సిలర్ మారత్ మెలికియన్ కూడా వేడుకల్లో పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఆహ్వానం మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, కేరళకు చెందిన ప్రముఖ నాయకుడు వి.డి. సతీశన్ కూడా ఈ ఏడాది వేడుకలకు హాజరవుతున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దేశ, విదేశాల ప్రముఖుల రాకతో మైసూరు దసరా ఉత్సవాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

రాజవంశ సంప్రదాయాలకు ప్రత్యేక పూజలు

మైసూరు రాజప్రాసాదంలో విజయదశమి సందర్భంగా సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వపు మైసూరు రాజవంశ వారసుడు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ అంబ విలాస్ ప్యాలెస్ నుంచి అదే ప్రాంగణంలోని భువనేశ్వరి దేవి ఆలయం వరకు 'విజయ యాత్ర' చేపట్టారు. అక్కడ శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1.36 గంటల నుంచి 1.56 గంటల మధ్య శుభప్రదమైన మకర లగ్నంలో ప్రధాన ఊరేగింపు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అంబ విలాస్ ప్యాలెస్‌లోని బలరామ ద్వారం వద్ద డి.కె. శివకుమార్, ఇతర మంత్రులు, ప్రముఖులు 'నంది ధ్వజం'కు పూజలు చేశారు. అనంతరం విజయదశమి ఊరేగింపునకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఊరేగింపు ప్రారంభానికి కొన్ని గంటల ముందే ప్రజలు మార్గమధ్యంలో పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు.

డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని అమిత్ షా పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల భవిష్యత్ తరాలు నాశనం కావడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని తెలిపారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలకు కూడా డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా ఆర్థిక సాయం అందుతోందని పేర్కొన్నారు. దిల్లీలో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక నిర్ణయం తీసుకుంది. 2026 సంవత్సరంలో మిగిలిన భాగం, 2027, 2028, 2029 ఈ మూడున్నరేళ్లలో డ్రగ్స్ వ్యతిరేకంగా ఒక ఉమ్మడి పోరాటం చేసి, 2029 డిసెంబర్ 31 నాటికి దేశానికి డ్రగ్స్ సమస్య నుంచి విముక్తి కలిగిస్తాం. ఇది మనకు అత్యంత ముఖ్యమైన లక్ష్యం. మూడు హాట్‌స్పాట్‌లను ఎదుర్కోవడం కంటే కూడా ఇది ఎంతో ముఖ్యమైంది. ఎందుకంటే డ్రగ్స్ సమస్య మన భావి తరాలను డొల్లగా మారుస్తుంది. ఆర్థిక వ్యవస్థపై అనవసరమైన భారాన్ని మోపుతుంది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలకు ఆర్థిక సహాయం అందించడం కూడా ఈ డ్రగ్స్ దందా నుంచే జరుగుతుంది."

డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

మాదకద్రవ్యాల సమస్య కేవలం వ్యక్తులకు సంబంధించినది మాత్రమే కాదని, అది దేశ భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతుందని అమిత్ షా అన్నారు. అందువల్ల మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం జాతీయ భద్రతకు కూడా కీలకమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'డ్రగ్స్‌పై పోరాటం' అనే థీమ్‌తో చేపట్టిన భారీ మోటార్ సైకిల్ ర్యాలీని అమిత్ షా జెండా ఊపి ప్రారంభించారు. తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 90 మంది పోలీసులతో కూడిన రైడర్లు ఇందులో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహనను పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ ర్యాలీలో పాల్గొనే రైడర్లు అక్టోబర్ 31న గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించే ఏక్తా పరేడ్‌లో పాల్గొంటారని అధికారిక ప్రకటన తెలిపింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, దిల్లీ ప్రాంతాలతో పాటు పలు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఇతర కేంద్ర పోలీసు సంస్థల సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగమయ్యారు.

నక్సలిజం నిర్మూలనలో పోలీసుల పాత్ర కీలకం

అలాగే దేశంలో దశాబ్దాలుగా కొనసాగిన నక్సలిజాన్ని 2026 మార్చి 31 నాటికి నిర్మూలించామని అమిత్ షా పేర్కొన్నారు. ఈ పోరాటంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), దాని కోబ్రా బెటాలియన్ కీలక పాత్ర పోషించాయని ప్రశంసించారు. భద్రతా బలగాల త్యాగాలు, అంకితభావం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించగలిగామని అన్నారు. 1981 నుంచి 2026 మార్చి మధ్య నక్సలిజానికి సంబంధించిన హింసాకాండలో 3,600 మందికి పైగా భద్రతా సిబ్బంది, సుమారు 13,700 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని అమిత్ షా తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన సిబ్బందికి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా కొనసాగిన నక్సలిజం సమస్యను అధిగమించి దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి భద్రతా సిబ్బంది చేసిన త్యాగాలు పునాది వేశాయని అమిత్ షా అన్నారు. అమరుల కుటుంబాల త్యాగాలను యావత్ దేశం గుర్తిస్తుందని, వారికి ప్రగాఢ కృతజ్ఞతలు తెలుపుతోందని పేర్కొన్నారు.

అమర పోలీసులకు ప్రధాని మోదీ నివాళులు

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులకు ఎక్స్ మాధ్యమంలో ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. శాంతి భద్రతలను కాపాడటం, నేరాలను అరికట్టడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించడం వంటి విషయాల్లో పోలీసుల కృషి వెలకట్టలేనిదని ప్రధాని కొనియాడారు. సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో అత్యంత నిబద్ధతతో పనిచేస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు చెప్పేందుకు పోలీసుల సంస్మరణ దినోత్సవం ఒక మంచి సందర్భం అని పేర్కొన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 21న జాతీయ పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 1959 అక్టోబర్ 21న లద్దాఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో భారీగా ఆయుధాలు ధరించిన చైనా సైనికులు జరిపిన దాడిలో 10 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

జాతీయ భద్రతను పరిరక్షించడంలో కేంద్రం విఫలం

మణిపుర్ హింసాకాండపై కాంగ్రెస్

మణిపుర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇటీవల నలుగురు అమాయక పౌరులు హత్యకు గురికావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 24,530 మంది సహాయక శిబిరాల్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మళ్లీ రక్తసిక్తమైన మణిపుర్

మణిపుర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో నలుగురు అమాయక పౌరులు దారుణంగా హత్యకు గురికావడాన్ని ఖర్గే ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ అసమర్థత వల్లే రాష్ట్రం మళ్లీ రక్తసిక్తమవుతోందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మే 2023లో లోయ ప్రాంతానికి చెందిన మైతీ వర్గానికి, కొండ ప్రాంతానికి చెందిన కుకీ వర్గానికి మధ్య ప్రారంభమైన జాతి ఘర్షణలు రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని పేర్కొన్నారు. ఈ హింసాకాండలో ఇప్పటివరకు కనీసం 306 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 49 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ ఘర్షణల ప్రభావాన్ని మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఇప్పటికీ ఎదుర్కొంటున్నాయని ఖర్గే అన్నారు. వేలాది మంది తమ ఇళ్లకు దూరంగా సహాయక శిబిరాల్లో జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడం, బాధితులకు భద్రత కల్పించడం, నిర్వాసితులను తిరిగి వారి నివాసాలకు చేర్చడం వంటి అంశాల్లో కేంద్రం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

మోదీ, అమిత్ షాకు మూడు ప్రశ్నలు

మణిపుర్ పరిస్థితులపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మూడు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. జూన్ 2023లో అమిత్ షా ఏర్పాటు చేసిన శాంతి కమిటీకి ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడానికి, పౌరులను రక్షించడానికి, భద్రతాపరమైన సవాళ్లను పరిష్కరించడానికి ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటని నిలదీశారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. సహాయక శిబిరాల్లో 31 అసహజ మరణాలు సంభవించినట్లు సుప్రీంకోర్టు వెల్లడించినప్పటికీ, వేలాది మంది ఇంకా ఎందుకు నిరాశ్రయులుగా ఉన్నారని ఖర్గే ప్రశ్నించారు. మహిళలు, పిల్లలు, నిర్వాసిత కుటుంబాల భద్రత, గౌరవం, పునరావాసం కోసం ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేళ్లకు పైగా కాలం గడిచినా పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం, ముఖ్యమంత్రిని మార్చడం, తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం వంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా శాంతి నెలకొనలేదని ఖర్గే అన్నారు. హింస ప్రారంభమైన తర్వాత దాదాపు 29 నెలల పాటు మణిపుర్‌లో అడుగుపెట్టని ప్రధాని మోదీ, పార్లమెంటులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇంతటి పాలనా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అమాయకుల ప్రాణాలు మరెన్ని కోల్పోతే కేంద్రం స్పందిస్తుందని నిలదీశారు. మణిపుర్‌కు న్యాయం, గౌరవం, రాజ్యాంగ హక్కులు, శాశ్వత శాంతి లభించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర భద్రత, స్థిరత్వాన్ని బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టకూడదని హెచ్చరించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖర్గే ఆరోపించారు.

ఈ నెల 23, 24 తేదీల్లో ఇండియన్ ఫార్మా ఫెయిర్

దేశవ్యాప్తంగా 70కి పైగా ఔషధ తయారీ సంస్థల భాగస్వామ్యం

6,000 నుంచి 8,000 మంది ఫార్మా రంగ నిపుణులు హాజరవుతారని అంచనా



విజయవాడ, మహానగర్

ఔషధ రంగంలో తయారీదారులు, పంపిణీదారులు, వ్యాపారవేత్తలు, ఫార్మా రంగ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే 17వ ఇండియన్ ఫార్మా ఫెయిర్ ఈ నెల 23, 24 తేదీల్లో నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు అని తెలిపారు. 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఫార్మెక్సిల్ ఇండియా వ్యవస్థాపకులు, మాజీ డైరెక్టర్ జనరల్, భారత ప్రభుత్వ నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్.పి.పి.ఎ) మాజీ డైరెక్టర్ అప్పాయి పద్మనాభుని ఈ ప్రదర్శనను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనకు కృష్ణా జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ మద్దతు, సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ ఫార్మాఫెయిర్‌కు అసోసియేషన్ అధ్యక్షుడు సి.సి. కేశవరావు, కార్యదర్శి పి. మురళీకృష్ణ సహకారంతో కార్యక్రమం నిర్వహించబడుతోందని తెలిపారు. బుధవారం నాడు జరిగిన విలేఖరుల సమావేశంలో బి.ఎస్.బండారి ఈ కార్యక్రమ వివరాలను వివరిస్తూ... ఈ ఏడాది ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 70కి పైగా ఔషధ తయారీ సంస్థలు పాల్గొననున్నాయి. మెడికెంట్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, సైకోకేర్ హెల్త్, ఫిజికెమ్ ఫార్ములేషన్, జెనిప్ ఫార్ములేషన్, బెస్ట్ బయోటెక్, తిరువిజన్ మెడికేర్, సురక్ష ఫార్మా, యునైటెడ్ లాబొరేటరీస్, సెంట్ క్యూర్, బజాజ్ ఫార్ములేషన్స్, బజాజ్ న్యూట్రాస్యూటికల్స్, యూనిగ్రో ఫార్మాస్యూటికల్, బయోఫార్ లైఫ్‌సైన్సెస్ తదితర సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి అని తెలిపారు. ఈ ఫెయిర్‌లో ఫార్ములేషన్స్, జనరిక్ మందులు, న్యూట్రాస్యూటికల్స్, సౌందర్య ఉత్పత్తులు, మూలికా, ఆయుర్వేద ఉత్పత్తులు, పశువైద్య ఔషధాలతో పాటు థర్డ్ పార్టీ తయారీ, కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, పీసీడీ ఫ్రాంచైజీలు, లోన్ లైసెన్సింగ్, ఎగుమతులకు సంబంధించిన సేవలు ప్రదర్శించబడతాయి అని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి సుమారు 6,000 నుంచి 8,000 మంది ఫార్మా రంగ నిపుణులు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ ఫెయిర్ లో మార్కెటింగ్ సంస్థలు, ఔషధ పంపిణీదారులు, ఎగుమతి సంస్థలు, ఆసుపత్రుల కొనుగోలు విభాగాల ప్రతినిధులు, స్టాకిస్టులు తదితరులు పాల్గొననున్నారు అని అన్నారు. ఔషధ తయారీదారులు తమ ఉత్పత్తుల నాణ్యతను ప్రదర్శించేందుకు, బ్రాండ్ గుర్తింపును పెంపొందించుకునేందుకు, నూతన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. రిటైలర్లు, హోల్‌సేలర్లు, పంపిణీదారులు కొత్త ఉత్పత్తులను తెలుసుకోవడానికి, ధరలు మరియు నాణ్యతను పోల్చి చూడడానికి, వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఈ వేదిక దోహదపడుతుందని తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఫార్మా వాణిజ్యానికి విజయవాడను ఒక ముఖ్యమైన కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడంలో ఇండియన్ ఫార్మా ఫెయిర్ కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. విలేఖరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు సి.సి. కేశవరావు, కార్యదర్శి పి. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా మహాలక్ష్మీ అమ్మవారి కల్యాణోత్సవం



నింద్ర, మహానగర్

మండల పరిధిలోని కూనమరాజుపాళెంలోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం, శ్రీ గీతామందిర ఆశ్రమంలో బుధవారం నవరాత్రి ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తనతో ప్రారంభమైన వేడుకల్లో మహిళలు 108 బిందెలతో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు, దినమలర్ దినపత్రిక పబ్లిషర్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.ఆర్. గోపాల్‌జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గీతామందిర ఆశ్రమ పీఠాధిపతి శ్రీ పుండరీక వరదానంద స్వామి, వేదపండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కల్యాణోత్సవంలో భాగంగా శ్రీ లక్ష్మీనారాయణ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి చంద్రప్రభ వాహనంపై ఆశీనులను చేశారు. రక్షాబంధనం, అంకురార్పణ, వస్త్ర సమర్పణ, మాంగళ్యధారణ, మాలా పరివర్తనం తదితర కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మాంగళ్యధారణ సమయంలో సుమంగళులు కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెరగాలని, ప్రతి ఒక్కరూ హిందూ ధర్మంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తి మార్గంలో పయనించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. విజయవాడకు చెందిన మహిళా బృందం నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం కర్పూర హారతులు సమర్పించి, కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు అమ్మవారి కుంకుమ, పసుపు దారాలు, రవిక వస్త్రాలను అందజేశారు. భక్తులకు గీతామందిర ఆశ్రమం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీనారాయణ మూర్తులను అలంకరించి దివ్యరథంపై గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట భజనలు, బాణసంచా కాల్పుల నడుమ సాగిన ఊరేగింపు భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో గంగాధర్, రవిచంద్ర, రవి నాయుడు, రాము, శేఖర్ నాయుడు, గ్రామస్థులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిస్తారా? బీజేపీని వ్యతిరేకిస్తారా?

విజయవాడ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు మద్దతివ్వడంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు. అలాగే కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులకు బహిరంగ మద్దతు తెలపడం జాతీయ రాజకీయాల్లో సరికొత్త రగడను రాజేసింది. గతంలో పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వానికి బేషరతుగా మద్దతు ఇచ్చి తప్పు చేశానని, చట్ట సవరణల విషయంలో పరోక్షంగా పశ్చాత్తాపపడిన జగన్, ఇప్పుడు నిజంగానే ఆచరణాత్మక వ్యతిరేకతను ప్రదర్శిస్తారా అనే చర్చ తీవ్రమవుతోంది. ఈ నెల చివర్లో లేదా రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో మోదీ ప్రభుత్వం అత్యంత కీలకమైన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోందనే ప్రచారంతో జగన్ తీసుకోబోయే స్టాండ్ ఆయన రాజకీయ భవిష్యత్తుకు కొలమానంగా మారనుంది.వైఎస్సార్‌సీపీకి ప్రస్తుతం లోక్‌సభ మ, రాజ్యసభల్లో ఉన్న సభ్యుల సంఖ్య స్వల్పమే అయినప్పటికీ, రాజ్యసభలో సంకీర్ణ సమీకరణాలు , విపక్షాల ఐక్యతను చాటడంలో ఆ కొద్దిమంది ఎంపీల ఓట్లు కూడా అత్యంత కీలకం కానున్నాయి. గత ఐదేళ్ల పాటు నల్లచట్టాలు, కీలకమైన బిల్లులు, డిప్యూటీ స్పీకర్ ఎన్నికల వరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మక మద్దతు ఇస్తూ వచ్చింది. అయితే, ఏపీలో 2024 ఎన్నికల ఓటమి తర్వాత, టీడీపీ-జనసేనలతో బీజేపీ జట్టుకట్టడంతో జగన్ ఒంటరి అయ్యారు. ఇప్పుడు కేంద్రానికి మద్దతిచ్చి తప్పు చేశానా? అనే ఆలోచనలో ఉన్న జగన్, రాబోయే డీలిమిటేషన్ చట్టసభల బిల్లు విషయంలో ధైర్యంగా వ్యతిరేక ఓటు వేయగలరా అన్నదే అసలైన ప్రశ్నగా మారింది.ఈ విమర్శలు, సవాళ్ల మధ్య వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ మాత్రం డీలిమిటేషన్ , మహిళా బిల్లులకు సూత్రప్రాయంగా మద్దతు ఇస్తామని ఇప్పటికే కొన్ని వేదికలపై సూచనలు ఇచ్చింది. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనలు దేశాభివృద్ధికి, దశాబ్దాల కల నెరవేర్చడానికి అవసరమైన ప్రాథమిక సంస్కరణలు అనే వ్యాఖ్యలతో వైఎస్సార్‌సీపీ ఎంపీలు సమర్థించుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయంగా బీజేపీకి వ్యతిరేకమని చెప్తూనే, ఇటువంటి ప్రజామోదయోగ్యమైన బిల్లులను రాజకీయాలకు అతీతంగా దేశ ప్రయోజనాల కోసం మద్దతిస్తున్నాం అని జగన్ ప్రకటిస్తే, అది మళ్లీ ఆయన్ను పాత పరోక్ష మద్దతు వైఖరిలోనే నిలబెడుతుంది. ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి విశ్వసనీయతపై ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఢిల్లీ వీధుల్లో బీజేపీకి వ్యతిరేకంగా నిరసన తెలిపే ప్రొటెస్ట్ గ్రూపులకు, ఈసీ వ్యతిరేక ఉద్యమాలకు ట్విట్టర్ వేదికగా బాహాటంగా మద్దతు ఇవ్వడం, మరోవైపు పార్లమెంట్ భవనంలోకి వచ్చేసరికి అదే బీజేపీ తీసుకొచ్చే రాజ్యాంగ సవరణ బిల్లులకు అనుకూలంగా ఓటు వేయడం ద్విముఖ వైఖరిని ఎండగడుతోంది. గతంలో తప్పు చేశానని జనం ముందు చెప్పడం, తీరా నిర్ణయాత్మక ఘట్టం వచ్చేసరికి మళ్లీ అదే తప్పును పునరావృతం చేయడం జగన్ రాజకీయ అనిశ్చితికి నిదర్శనం అని ప్రతిపక్షాలు ఎద్దేవా చేసే అవకాశం ఉంది. మరో కోణంలో చూస్తే, జగన్ ముందు రెండు స్పష్టమైన మార్గాలు మాత్రమే మిగిలాయి. మొదటిది.. తాము విధానపరంగా బీజేపీతో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నామని నిరూపించుకోవడానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి కీలక బిల్లును సూటిగా వ్యతిరేకించడం, తద్వారా జాతీయ స్థాయిలో ఇండియా కూటమి లేదా ఇతర తటస్థ విపక్షాల సరసన నిలవడం. రెండోది.. జాతీయ అంశాలు వేరు, ప్రాంతీయ రాజకీయాలు వేరు అని చెప్తూ, భవిష్యత్తులో కేసుల ఒత్తిడి , కేంద్ర యంత్రాంగం నుంచి ఉపశమనం కోసం బిల్లులకు మద్దతు నిరంతరం కొనసాగించడం. కానీ, రెండో మార్గాన్ని ఎంచుకుంటే మాత్రం మళ్లీ తప్పు చేశానని భవిష్యత్తులో చింతించాల్సి వస్తుందనే విమర్శలను ఆయన తప్పించుకోలేరు. బిల్లులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నైతిక రాజకీయాలకు, సిద్ధాంతపరమైన స్టాండ్‌కు అసలైన అగ్నిపరీక్షగా మారనున్నాయి. మాటల్లో బీజేపీ వైఖరిని, ఎన్నికల వ్యవస్థను తప్పుబడుతున్న జగన్, చేతల్లో పార్లమెంట్ వేదికగా ఓటింగ్ సమయానికి ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ నిర్ణయమే రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ జాతీయ స్థాయి రాజకీయ భవిష్యత్తును, మిత్రులెవరో శత్రువులెవరో తేల్చే కీలక ఘట్టం కానుంది.

షేర్.మార్కెట్ ఇక.. ఫోన్‌పే ఇన్వెస్ట్

విశాఖపట్నం, మహానగర్

ఫోన్‌పే తన పెట్టుబడులు, ట్రేడింగ్ వేదిక షేర్.మార్కెట్ పేరును ఫోన్‌పే ఇన్వెస్ట్‌గా మార్చినట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పోర్ట్‌ఫోలియో ఆప్టిమైజర్ అనే కొత్త సాధనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఒకే వేదికపై రూపొందించుకోవడం, సమీక్షించడం, మెరుగుపరుచుకోవడం చేయవచ్చు. ఈ వేదికపై షేర్లు, ఐపీఓలు, మ్యూచువల్ ఫండ్లు, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) సేవలు అందుబాటులో ఉంటాయి. వివిధ డీమ్యాట్ ఖాతాల్లోని పెట్టుబడులను ఒకేచోట పరిశీలించి, వాటి పనితీరు, రిస్క్‌లను అంచనా వేసుకునే అవకాశం ఉంటుంది. పరిశోధన ఆధారిత సూచనలు పెట్టుబడులను కొనసాగించాలా, పర్యవేక్షించాలా, విక్రయించాలా అనే నిర్ణయాలకు తోడ్పడతాయి. ఫోన్‌పే వ్యవస్థాపకుడు, సీటీపీఓ రాహుల్ చారి మాట్లాడుతూ, భారతీయుల్లో పెట్టుబడులపై అవగాహన పెంచి, ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకునేలా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుత వినియోగదారుల డీమ్యాట్ పెట్టుబడులు, బ్యాలెన్స్‌లు, వాచ్‌లిస్ట్‌లు, ఆర్డర్ చరిత్ర, లాగిన్ వివరాల్లో మార్పులుండవని, బ్రోకరేజ్ ఫీజులు, వార్షిక నిర్వహణ ఛార్జీలు కూడా యథాతథంగా కొనసాగుతాయని సంస్థ వెల్లడించింది.

జగన్‌ను ర్యాగింగ్ చేసిన విజయసాయి!

విజయవాడ

మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి దసరా పండుగ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి సంబంధించిన ముహూర్తాన్ని, ఆశయాలను వెల్లడిస్తూ కీలక ప్రకటన చేశారు. ఈ క్రమంలో ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా కొత్త పార్టీ ఆవిర్భవించబోతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2 పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలకడం, కులపిచ్చి, మతపిచ్చి రాజకీయాలను రూపుమాపడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. అలాగే రెడ్ బుక్ రాజ్యాంగం, రప్పారప్పా ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించి, కరువు కాటకాలు, కరెంటు కోతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామని దసరా పండుగరోజు మాజీ ఎంపీ ప్రకటించారు.విజయసాయిరెడ్డి తన కొత్త పార్టీ ప్రకటన తేదీని, ముహూర్తాన్ని ప్రకటించారు. అన్నీ పదకొండులు వచ్చేలా చూసుకున్నారు. గతంలో దసరాకే పార్టీ పెడతానని చెప్పిన ఆయన .. పార్టీ పెట్టే రోజును దసరా రోజునుప్రకటించారు. ఆ రోజును, ముహూర్తాన్ని చూస్తే ఆయన జగన్ రెడ్డిని ర్యాగింగ్ చేశారని సులువుగా అర్థమైపోతుంది. 11వ నెల 11వ తేదీన సరిగ్గా ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ-కన్వెన్షన్‌లో నూతన పార్టీని ఘనంగా ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు.గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘోర పరాజయం పాలై కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. అప్పట్నుంచి 11 అంటే వైసీపీ నేతలు ఉలిక్కి పడుతున్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసిన ఆ 11 సంఖ్య జగన్‌కు, వైఎస్సార్సీపీ శ్రేణులకు రాజకీయంగా ఒక పెద్ద పీడకలగా మారింది. అలాంటి పచ్చి పుండుపై కారం చల్లేలా.. విజయసాయిరెడ్డి తన పార్టీ ప్రకటన ముహూర్తంలో నెల, తేదీ, గంటలు, నిమిషాలు అన్నీ కలిపి వరుసగా 11:11:11:11 వచ్చేలా పక్కాగా సెట్ చేశారు. గతంలో జగన్‌కు ఆర్థిక, రాజకీయ సలహాదారుగా నిలిచి లెక్కల మాస్టారు గా పేరుగాంచిన సాయిరెడ్డి.. ఇప్పుడు అదే లెక్కలతో జగన్ ఓటమి సంఖ్యను గుర్తుచేస్తూ పబ్లిక్‌గా ట్రోల్ చేశారుకేవలం ముహూర్తంతోనే ఆగకుండా పార్టీ ఎజెండా ద్వారా కూడా జగన్ పాలనను, వైఎస్సార్సీపీ మూలాలను విజయసాయిరెడ్డి తీవ్రంగా ఎద్దేవా చేశారు. రెండు పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలికేలా.. రప్పరప్ప ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించేలా.. జెన్-జీ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా తమ పార్టీ వస్తోందని పోస్టర్‌లో పేర్కొనడం జగన్‌ను నేరుగా టార్గెట్ చేయడమే. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత ప్రయోజనాలు చూసుకున్నారని, యువతను కేవలం జేజేలు కొట్టే గుంపులుగా మార్చారని దశకంఠుడి అవలక్షణాలంటూ 10 పాయింట్లతో జగన్ రాజకీయ తీరును ఉతికి ఆరేశారు. నిన్నటిదాకా తమతో ఉన్న ముఖ్య నేతే ఇలా 11 నంబర్‌తో వ్యంగ్యాస్త్రాలు సంధించడం తాడేపల్లి ప్యాలెస్‌కు మింగుడుపడటం లేదుకొన్ని రోజుల కిందట విజయసాయిరెడ్డి పార్టీ ఆవిర్భావం ప్రకటన చేయాల్సి ఉండగా.. అనారోగ్యం కారణంగా వాయిదా వేసుకున్నట్లు ప్రకటించారు. ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్నానని, త్వరలోనే పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేస్తానన్నారు. అయితే వైసీపీ నుంచి బెదిరింపులకు పాల్పడటంతో ఆయన వెనక్కి తగ్గారని, మరికొన్ని వర్గాల వారు విజయసాయిరెడ్డిని భయపెట్టడంతో మాజీ ఎంపీ వెనక్కి తగ్గారని ప్రచారం జరిగింది. అయితే తాను పార్టీ పెట్టడంలో వెనక్కి తగ్గేదిలేదని, తనను ఎవరూ బెదిరించలేదన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు కోసం కచ్చితంగా తన పోరాటం కొనసాగుతుందన్నారు.

పిరమల్ ఫైనాన్స్ నికర లాభం రూ.545 కోట్లు

విజయవాడ

పిరమల్ ఫైనాన్స్ లిమిటెడ్ 2027 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.545 కోట్ల పన్ను అనంతర నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 67 శాతం వృద్ధి సాధించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో సాధించిన ఈ వృద్ధితో, 2027 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో కంపెనీ నికర లాభం కూడా 67 శాతం పెరిగి రూ.1,006 కోట్లకు చేరింది. కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెరిగి రూ.1,13,112 కోట్లకు చేరుకుంది. నిలిపివేసిన పాత వ్యాపారాన్ని మినహాయించి లెక్కించిన వృద్ధి ఏయూఎంలో 30 శాతం పెరుగుదల నమోదైంది. రిటైల్ రుణ పంపిణీలు 34 శాతం వృద్ధితో రూ.14,646 కోట్లకు చేరాయి. దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల్లోని 621 నగరాల్లో కంపెనీ శాఖల సంఖ్య 838కు పెరిగింది. వినియోగదారుల సంఖ్య 26 శాతం వృద్ధితో 65 లక్షలకు చేరినట్లు సంస్థ వెల్లడించింది. భవిష్యత్తులో రిటైల్ రుణ వ్యాపార విస్తరణకు మద్దతుగా కంపెనీ రూ.3,850 కోట్ల ఈక్విటీ మూలధనాన్ని సమీకరించింది. ఇందులో రూ.2,100 కోట్ల క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ), ప్రమోటర్ గ్రూప్‌కు రూ.1,750 కోట్ల విలువైన వారెంట్ల ప్రాధాన్యత కేటాయింపు ఉన్నాయి. ఇదిలా ఉండగా, భారతీయ స్టేట్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ దినేష్ కుమార్ ఖారాను ఐదేళ్ల కాలానికి స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించినట్లు కంపెనీ ప్రకటించింది. దాదాపు నాలుగు దశాబ్దాల ఆర్థిక సేవల రంగ అనుభవం కలిగిన ఆయన మార్గదర్శకత్వం సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని పిరమల్ ఫైనాన్స్ ఆశాభావం వ్యక్తం చేసింది.

దక్షిణాదిలో ష్నైడర్ ఎలక్ట్రిక్ సర్వీసెస్ ఎక్స్‌ప్రెస్

విజయవాడ, మహానగర్



గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ సంస్థ ష్నైడర్ ఎలక్ట్రిక్ దక్షిణాదిలో సర్వీసెస్ ఎక్స్‌ప్రెస్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా మొబైల్ సర్వీస్ ఇన్నోవేషన్ హబ్‌ను 120 రోజులకు పైగా ఐదు రాష్ట్రాల్లోని 20కి పైగా నగరాలకు తీసుకెళ్లనుంది. బెంగళూరులో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా పారిశ్రామిక సంస్థలకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత పర్యవేక్షణ, కండిషన్ బేస్డ్ మెయింటెనెన్స్, లైఫ్‌సైకిల్ పరిష్కారాలను ప్రత్యక్షంగా ప్రదర్శించనుంది. ఈ సందర్భంగా ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ దామిని చౌదరి మాట్లాడుతూ, విద్యుత్ పరికరాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతల ప్రాధాన్యాన్ని వివరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. డిజిటల్ మానిటరింగ్, నిర్వహణ సేవలను సమన్వయం చేయడం ద్వారా పరికరాల విశ్వసనీయత పెంచి, అనుకోని అంతరాయాలను తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. డేటా సెంటర్లు, పరిశ్రమలు, భవనాలు, విద్యుత్ గ్రిడ్‌లు వంటి కీలక రంగాలకు ఈ కార్యక్రమం సేవలందించనుంది. కర్ణాటక, కేరళ, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించే ఈ మొబైల్ హబ్ ద్వారా సంస్థలు తమ విద్యుత్ పరికరాల జీవితకాల నిర్వహణ, ఆధునీకరణ, పనితీరు మెరుగుదలపై అవగాహన పొందనున్నాయి.

గుండె ఆరోగ్యం మన చేతుల్లోనే!

చిన్న మార్పులతో పెద్ద ప్రయోజనం



గుండె మన శరీరానికి జీవం. ఇది రోజూ నిమిషారం లక్షలాది సార్లు కొట్టుకుపతూ మనల్ని బ్రతకిస్తుంది. కానీ ఆధునిక జీవనశైలి, ఒత్తిడి, చెడు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం వంటివి గుండ జబ్బులకు దారి తీస్తున్నాయి. అందుకే గుండె ఆరోగ్యంపై వహాళ్ల శ్రద్ర వాద్యత.

గుండె ఆరోగ్యానికి ముఖ్యమైన సూచనలు

- రోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయండి.
- జంక్ ఫుడ్, చేయంచిన పదార్లాలు తగ్గించండి.
- ఉప్పు, విస్తుమగాన్ని నియంత్రించండి.
- పందఖు, మద్యపానం మానండి.
- ఉవ్తరివివి బరుప్పును నియంత్రించండి.
- తక్కువ ఒత్తడిని, సరైన నిద్రను అలవాటు చేసుకోండి.
- నియమితంగా వైద్య పరీక్షలుచేయంచుకోండి.

గుండె ఆరోగ్యంగా ఉంటే... జీవితం ఆనందంగా ఉంటుంది!

సరైన ఆహారం... సరైన ఆరోగ్యం

ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాపారం తీసుకోవడం ఎంతో ముఖ్యం. పండ్లు, కూరగాయలు, పాలు, గింజలు, ధాన్యాలు మన శరీరానికి అవనరమైన విటమిన్లు, భనిజాలు, ప్రోటీన్లను అందిస్తాయి.



తప్పక తీసుకోవాల్సినవి

- పండ్లు – రోజూ కనీసం 2-3 రకాల పండ్లు
- కూరగాయలు – రంగురంగుల కూరగాయలు
- ధాన్యాలు – బ్రౌన్ రైస్, ఓట్స్, జొన్నలు
- ప్రోటీన్లు – పప్పులు, గుడ్లు, చేపలు
- నీరు – రోజుకు 8-10 గ్లాసుల నీరు

తగ్గించాల్సినవి

- జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్
- అధిక ఉప్పు, చక్కెర
- స్నాకెట్ ఫుడ్స్, సోడాలు

మధుమేహం (డయాబెటీస్) – జాగ్రత్త జీవితం

మధుమేహం ఒక దీర్ఘకాలిక వ్యాధి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల శరీరంలోని అవయవాలు దెబ్బతింటాయి. సరైన ఆహారం, వ్యాయామం, నియంత్రణతో దీన్ని అదుపులో ఉంచుకోవచ్చు.



లక్షణాలు

- ఎక్కువ దాహం
- మూత్ర విసర్జన ఎక్కువ
- బరువు తగ్గిడం
- అలసట
- కంటి సమస్యలు

నివారణ, నియంత్రణ

- తక్కువ చక్కెర, తక్కువ కార్బోహైడ్రేట్లు
- రోజూ వ్యాయామం చేయండి.
- రక్తంలో చక్కెర స్థాయిని క్రమం తప్పకుండా పరిశీలించండి
- నియమిత వైద్య పరీక్షలు చేయంచుకోండి.

రోగనిరోధక శక్తిని పెంచుకునే మార్గాలు

తక్కువ రోగనిరోధక శక్తి వల్ల లన్న జలుబు, జ్వరాలు కూడా తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. సరైన ఆహారం, వ్యాయామం, నిద్ర, ఒత్తిడి నియత్రణ పాటించాలి.



ఇలా చేయండి

- నిత్యం విటమిన్ C ఉన్న ఆహారం తీసుకోండి.
- పర్యాప్తా నీరు తాగండి.
- పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినండి.
- తగ్గినంత నిద్ర తీసుకోండి.
- ఒత్తిడిని దూరంగా ఉంచుకోండి.

మంచి నిద్ర... మంచి జీవితం

నిద్ర శరీరానికి విశ్రాంతి ఇస్తుంది. మెదడు పనితీరు, మానసిక స్థితి, రోగనిరోధక శక్తి కోసం నిద్ర ఎంతో అవసరం. రోజుకు 7-8 గంటల నిద్ర తప్పనిసరి.



నిద్రకు ముందు పాటించాల్సినవి

- మోవైల్, టీవీ వాడకాన్ని తగ్గించండి.
- తగ్గిన సమయానికి పడుకోండి.
- కాఫీ, టీ తక్కువగా తీసుకోండి.
- సాకర్యమైన పడక, చల్లని వాతావరణం.

ఆరోగ్యకరమైన జీవనశైలి 5 సూత్రాలు



వ్యాయామం చేయండి

రోజూ కనీసం 30 నిమిషాలు కదలండి. శరీరాన్ని చురుకుగా ఉంచుకోండి.



సరైన ఆహారం తీసుకోండి

పండ్లు, కూరగాయలు, ధాన్యాలు ఎక్కువగా తినండి.



నీరు ఎక్కువగా తాగండి

రోజుకు 8-10 గ్లాసుల నీరు తప్పనిసరి.



ధూమపానం, మద్యం మానండి

ఇవి ఆరోగ్యానికి హానికరం.



సంతోషంగా ఉండండి

మానసిక ప్రశాంతత కూడా ఆరోగ్యానికి ముఖ్యం.

ఆరోగ్యమే మహాభాగ్యం... జాగ్రత్తగా ఉండండి... సంతోషంగా జీవించండి...

భోగి' సినిమా నుంచి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటే సాంగ్



చార్మింగ్ స్టార్ శర్వా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర?ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. గ్రామీణ సంప్రదాయాలు, మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులతో ముడిపడిన సహజమైన పల్లెటూరి ప్రపంచాన్ని ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి ఆసక్తిని రేకెత్తించగా, తొలి పాట 'ఎగిలివారంగ' సినిమాలోని పల్లె వాతావరణంతో కూడిన సంగీత ప్రపంచాన్ని పరిచయం చేసింది. దసరాకు ఒక రోజు ముందు మేకర్స్ ఈ సినిమా నుంచి రెండో పాట 'అన్నయ్య పానం' ను విడుదల చేశారు. ఐదుగురు చెల్లెళ్లపై ఒక అన్నయ్య చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతలను హృద్యంగా ఆవిష్కరించే ఈ పాటతో పాటు, ప్రధాన జంట ప్రేమకథకు సంబంధించిన కొన్ని అందమైన క్షణాలను కూడా చూపించారు. పల్లెటూరి మట్టి వాసనతో కూడిన పాటలను అందించడంలో ప్రత్యేకత కలిగిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను మనసు ఆకట్టుకునేల స్వరపరిచారు.భావోద్వేగాల లోతుతో సాగే ఈ మెలోడీ వినగానే ఆకట్టుకుంటుంది. ఆస్కార్ విజేత, గీత రచయిత చంద్రబోస్ సాహిత్యంతో పాటకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అనురాగం, త్యాగం, విడదీయలేని అనుబంధాన్ని తన సాహిత్యంలో అందంగా ఆవిష్కరించారు.

సింగర్ శ్రీకృష్ణ తన వోకల్స్ తో ఈ పాటకు ప్రాణం పోశారు. ఆయన వాయిస్ పాటలోని భావోద్వేగాలను మరింత పెంచుతుంది. కథలోని రొమాంటిక్ కోణాన్ని కూడా ఈ పాట ఆవిష్కరిస్తుంది. శర్వా, అనుపమ పరమేశ్వరన్ పాత్రల మధ్య కెమిస్ట్రీని అందంగా చూపించారు. అనీ మాస్టర్ కొరియోగ్రఫీ పాటలోని భావానికి చక్కగా సరిపోగా, సహజమైన పల్లెటూరి వాతావరణం, ఆప్యాయతతో కూడిన కుటుంబ సన్నివేశాలు విజువల్స్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి.

పల్లెటూరి యువకుడిగా శర్వా తన సహజమైన లుక్‌తో ఆకట్టుకున్నారు. నిజాయితీతో కూడిన నటనతో తన పాత్రకు భావోద్వేగాల లోతును జోడించారు. పాటలో ప్రధానంగా కనిపించే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆయన నటన మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. పల్లెటూరి అమ్మాయిగా అనుపమ పరమేశ్వరన్ అందంగా ఆకట్టుకున్నారు. అద్భుతమైన నటన, మనసును తాకే సాహిత్యం, అందమైన విజువల్స్ కలగలిసి ఈ పాటను 'భోగి' సంగీత ప్రయాణంలో గుర్తుండిపోయే పాటగా నిలబెట్టాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌తో పాటు డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటించనున్నారు. నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి



'ఆది రుద్ర' సినిమా పోస్టర్ మోషన్ వీడియో రిలీజ్

ఆది సాయికుమార్ హీరోగా త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రంతో ఆసక్తికరమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. దైవిక , అతీంద్రియ రహస్యాలు, ఉత్కంఠభరితమైన సస్పెన్స్ కలగలిసిన కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రశాంత్ జి. రుద్రప్ప నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమాకు పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటిస్తూ ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'ఆది రుద్ర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్‌లో ఆది సాయికుమార్ త్రిశూలం పట్టుకుని, వెనక్కి తిరిగి నిలబడిన తీరు ఆకట్టుకుంటోంది. లో యాంగిల్‌లో రూపొందించిన ఈ కంపోజిషన్ ఆయన ఇంటెన్స్ ప్రజెన్స్ మరింత ప్రభావవంతంగా చూపిస్తోంది. ఆకాశాన్ని తాకేలా కనిపించే భారీ పర్వతాకార నిర్మాణంపై దుర్గామాత రూపం దర్శనమిస్తోంది. మరోవైపు, వెలుగుతున్న కాగడాలు పట్టుకున్న భారీ జనసమూహం వృత్తాకారంలో ఉన్న యజ్ఞస్థలాన్ని చుట్టుముట్టిన దృశ్యాలు పోస్టర్‌కు మరింత మిస్టరీని జోడిస్తున్నాయి. మనిషికి, అతీంద్రియ ప్రపంచం పథ్యంలో ఈ కథ సాగనుందనే ఆసక్తిని ఈ విజువల్స్ కలిగిస్తున్నాయి. 1960ల నుంచి 1990ల మధ్య కాలంలో జరిగే కథతో 'ఆది రుద్ర' తెరకెక్కుతోంది. ఈ ప్రత్యేకమైన పీరియడ్ నేపథ్యం సినిమాలోని పాత్రలు, విజువల్ స్టైల్, ఆ కాలం నాటి వాతావరణాన్ని మళ్లీ సృష్టిస్తూ, ఆసక్తికరమైన దైవిక రహస్యాన్ని మిళితం చేసి ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించాలనేది మేకర్స్ లక్ష్యం. ఈ చిత్రానికి ఏజే శెట్టి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 'కాంతార', 'విరూపాక్ష', 'మంగళవారం', తమిళ బ్లాక్‌బస్టర్ 'మహారాజా' చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మోషన్ వీడియోకు ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ డివైన్ వైబ్ ను అద్భుతంగా ఆవిష్కరిస్తోంది.



30న వస్తున్న 'ఆదర్శ కుటుంబం'

అగ్ర హీరో వెంకటేష్ అంటేనే కుటుంబ కథా చిత్రాలకు పెట్టింది పేరు. ఇక మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దాదాపు ఇరవైఏండ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఆదర్శ కుటుంబం-హౌస్ నంబర్ 47 (ఏకే 47)'. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ కలబోతగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం బుధవారం ప్రకటించింది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, కుటుంబ ప్రేక్షకులు మెచ్చే సంపూర్ణ వినోదాత్మక చిత్రమిదని మేకర్స్ తెలిపారు. శ్రీనిధిశెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాత: ఎస్.రాధాకృష్ణ (చినబాబు), సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: త్రివిక్రమ్ శ్రీనివాస్

దుష్ట శిక్షణలో కనకదుర్గ

నిధి అన్వేషణ ప్రధాన ఇతివృత్తంగా రూపొందిస్తున్న చిత్రం 'సన్ ఆఫ్ కనకదుర్గమ్మ'. లయ, అనురూప్ కటారి, ఆకాంక్ష త్యాగరాజన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి దుర్గ ఫణిందర్ దర్శకుడు. దసరా సందర్భంగా ఈ సినిమా స్పెషల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాతలు అశ్వనీదత్, స్వప్నదత్ విడుదల చేశారు. ఇందులో నటి లయ అమ్మవారి అవతారంలో శక్తివంతంగా కనిపిస్తున్నారు. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగే ఈ కథలో విజువల్స్, యాక్షన్ ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని, దుష్టశిక్షణ గావించే అమ్మవారి అవతారంలో లయ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందిస్తాయని చిత్రబృందం పేర్కొన్నది. ఈ చిత్రానికి సంగీతం: శశిధర్ లంక, కథ: కాకర్ల గోవర్ధన రావు, నిర్మాతలు: వాణి శంకర్, తిలోత్తమ, దర్శకత్వం: దుర్గ ఫణిందర్ లంక.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999